www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 188 | శనివారం | 09 మే 2026 | పేజీలు : 04 వెల ‘5

మీ స్తుతి దేవుని కోసం కాదు. ఇది మీ కోసమే. మీరు భగవంతుని స్తు తిస్తారు, ఆయన మీ ఆత్మను ఉద్ధ రిస్తాడు. ఆ మంచి గుణాలన్నింటి నీ మీరే బయటకు తీసుకువస్తారు. స్తుతింపబడటంతో భగవంతుడు చాలా సంతోషించి మీకు ఆశీర్వా దం ఇస్తాడని కాదు. మీరు ఈ వి ధంగా భగవంతునికి లంచం ఇవ్వ లేరు. మనం భగవంతునికి ప్రార్థన చేస్తాము. మనం ప్రతి మతంలో నూ ఇది చేస్తాము. ప్రార్థించడం ద్వారా మనం భగవంతుని సంతో షపెడుతున్నామని, ప్రార్థించకపోతే భగవంతునిపై కోపంగా ఉన్నామని మనం అనుకుంటాము. నేను అలా అనుకోను. ప్రార్థన మీ జన్మ వాణి. మీకు ఏదైనా కావాలంటే ప్రార్థిస్తా రు. ధ్యానం ప్రార్థన కంటే కూడా శ్రేష్ఠమైనది. ప్రార్థన యొక్క అంతం ధ్యానం అయి ఉండాలి. ధ్యానం అంటే భగవంతునితో, “నేను నీ మాట వినడానికి ఇక్కడ ఉన్నాను. నీవు నాకు ఏమి చెప్పాలనుకుం టున్నావు? నీ కోరిక నెరవేరాలి” అని చెప్పడమే. ఇదే ధ్యానం.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ



# కలసికట్టుగా కదంతొక్కుదాం

## ‘సర్’ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఎదుర్కొందాం

ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లు జరగనివ్వొద్దు

హజ్ యాత్రికులపై పెరిగిన అదనపు ప్రయాణ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది

హజ్ యాత్ర ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

ఒక్కొక్కరికీ రూ.10 వేలు అదనంగా పెరిగిందన్న హజ్ కమిటీ



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట తెలంగాణలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో జరిగినట్టుగా ఇక్కడ జరగనివ్వకూడదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అందరం కలిసికట్టుగా ‘సర్’ను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నాంపల్లిలోని హజ్ హౌస్ నుంచి బయలుదేరుతున్న హజ్ యాత్రికుల బస్సులను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అలాగే, మైనారిటీ సంక్షేమ శాఖపై సచివాలయంలో సమీక్షించారు. ఆయా సందర్భాల్లో సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిలో మైనారిటీల వాటాను వారికి అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో విమాన ప్రయాణ చార్జీలు పెరిగాయని, హజ్ యాత్రికులపై ఏటా అయ్యే ఖర్చు కంటే అదనంగా కొంత భారం పడుతోందని, పెరిగిన అదనపు ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. నిజానికి, హజ్ యాత్రకు వెళ్లే వారికి ఒక్కొక్కరికీ ఏటా అయ్యే ఖర్చు కంటే అదనంగా మరో రూ.10 వేలు ఎక్కువ అవసరమవుతాయని, ఆ మేరకు డబ్బులు సర్దుబాటు చేసుకోవాలని ఇండియా హజ్ కమిటీ ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే, తెలంగాణ నుంచి హజ్ వెళ్లేందుకు నమోదు

మిగతా 2 లో

## బంగారు తునకగా ‘కొడంగల్’

రెండు నెలల్లో వికారాబాద్-కృష్ణా రైల్వే లైను

టేకుల్‌కోడ్ వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం

లగచర్ల పార్కుకు పెద్ద పెద్ద పరిశ్రమలు

‘కొడంగల్’ను బంగారు తునక చేసుకుందాం

నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కొడంగల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్



# తమిళనాట దాగుడుమూతలు

## మలుపులు తిరుగుతున్న తమిళ కథా చిత్రం

మద్దతు కూడగట్టడంలో విజయ్ విఫలం

ముఖ్యమంత్రి పీఠంపై అవే దాగుడు మూతలు

కాంగ్రెస్‌తోపాటు కొత్తగా సీపీఐ, సీపీఎం మద్దతు

వరుసగా మూడోరోజు గవర్నర్‌తో విజయ్ భేటీ

116 మంది ఎమ్మెల్యేల జాబితా సమర్పణ

ఐయూఎంఎల్, వీసీకే మద్దతుపై సంకేతాలు

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ అని వార్తలు

టీవీకేకు మద్దతుపై ఐయూఎంఎల్, వీసీకే ససేమిరా

తాము డీఎంకేతోనే ఉంటామని తేల్చి చెప్పిన నేతలు

లోక్‌భవన్ నుంచి వెలువడని అధికారిక ప్రకటన

అర్ధరాత్రి లోక్‌భవన్‌కు దినకర్.. కారణమేమిటో!?

తమిళనాడులో నడుస్తున్న ‘హంగ్’ రాజకీయం సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపింపజేస్తోంది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధిపతి విజయ్‌తో ‘సీఎం పీఠం’ దోబూచులాడుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలాన్ని సాధించడంలో విజయ్ తడబాటు కొనసాగుతూనే ఉంది. వరుసగా మూడోరోజు శుక్రవారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను విజయ్ కలిశారు.

04

## సుప్రీంకు టీవీకే

ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాల్సిందిగా గవర్నర్‌ను ఆదేశించాలని అభ్యర్థన

విజయ్‌ను తప్ప మరే కూటమినీ పిలవకుండా అడ్డుకోవాలని వినతి

అత్యవసరంగా విచారించాలని కోరిన ఆ పార్టీ సభ్యుడు ఎళిలరసి



## ఫాం హౌస్ డ్రగ్స్ కేసులు మాకైతే తెలువదు

కేటీఆర్...

నోరు అదుపులో పెట్టుకో

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల: సంజయ్

03

# ఆగస్టులోగా ‘మూసీ’ ఆరంభించాలి

నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా మూసీ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మార్చుకోవాలి

పనులు అత్యంత పారదర్శకంగా చేపట్టాలి

ప్రజల భాగస్వామ్యంతో సాకారం చేయాలి

వచ్చే ఆగస్టులో పనులు ప్రారంభించాలి

అధికారులతో భేటీలో క్యాబినెట్ సబ్ కమిటీ

## మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

మూసీతో నగరరూపు రేఖలు మారుతాయి

స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది

అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం

కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

02



మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు తొలిదశలో భాగంగా 21 కిలోమీటర్లలో ఎలాంటి ఇబ్బందిలేని ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని క్యాబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు, ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఫేజ్-1 పనులు చేపట్టనున్న విషయాన్ని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదని, అది ఒక సామాజిక బాధ్యత అని సబ్ కమిటీ పేర్కొంది.

# బెంగాల్ సీఎం.. సువేందు

బీజేపీఎల్పీ నేతగా ఎన్నిక ప్రకటించిన అమిత్ షా

గవర్నర్‌ను కలిసిన సువేందు

నేడు కోల్‌కతాలో ప్రమాణం

హాజరు కానున్న ప్రధాని మోదీ



03

# అన్నిట్లో ‘రేవంత్’ అట్టర్ ప్లాప్

దేశంలో అత్యధికంగా 27,230 సైబర్ నేరాల నమోదు

ఎన్‌సీఆర్‌బీ నివేదికతో బయటపడిన నేరాల రేటు: హరీశ్

ముఖ్యమంత్రిగానే కాకుండా రాష్ట్ర హోంశాఖ మంత్రిగానూ రేవంత్ విఫలమయ్యారని, తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. 2024 ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న రాష్ట్రంగా మారడం ఆందోళనకరమన్నారు.



# రాష్ట్రంలో మోదీ మేనియా

2, 3 నెలల్లోనే మార్పులు చూస్తారు

తెలంగాణలో బెంగాల్ జోష్ కొనసాగిస్తాం

రేపు పరేడ్‌గ్రౌండ్‌లో మోదీ సభ

రాష్ట్రానికి మోదీ రూ.8 వేల కోట్ల అభివృద్ధి కానుక: రాంచందర్‌రావు

మోదీ సభను విజయవంతం చేయండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

మోదీతో కలిసి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం రేవంత్

03



# కేరళ సీఎం వేణుగోపాల్?

కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అత్యధికులు ఆయన వైపే!

ఖర్గేకు పార్టీ పరిశీలకుల నివేదిక

11న ప్రమాణ స్వీకారం?.. రేసులో సతీశన్, చెన్నితల

మిత్రపక్షాల ఓటు సతీశన్‌కే

# బంగారు తునకగా 'కొడంగల్'

**రెండు నెలల్లో వికారాబాద్-కృష్ణా రైల్వే లైను**
**టేకుల్‌కోడ్ వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం**
**లగచర్ల పార్కుకు పెద్ద పెద్ద పరిశ్రమలు**
**'కొడంగల్'ను బంగారు తునక చేసుకుందాం**
**నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా**
**కొడంగల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్**
**3 ఆలయాల పునరుద్ధరణ, 430 పడకల ఆస్పత్రి**
**నిర్మాణ పనులకు మంత్రులతో కలిసి భూమిపూజ**



**ప్రజా దీవెన, వికారాబాద్ :** "పెద్ద కుర్చీయే ఉంది. ఏ పని కావాలన్నా చేసుకోవచ్చు. రెండేళ్లలో కొడంగల్ నియోజకవర్గాన్ని బంగారు తునకలా.. దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిన్నరలోపు పూర్తి చేసి కృష్ణా జలాలను కొడంగల్‌కు తీసుకు వస్తామని చెప్పారు. ఈ పథకం పనులు వేగవంతం చేసేందుకు భూసేకరణ బాధ్యతను మంత్రి శ్రీహరికి అప్పగిస్తే నెల రోజుల్లోనే 98 శాతం పూర్తి చే శారన్నారు. ఎత్తిపోతల పథకానికి ఇక ఎలాంటి అడ్డంకులు లేవని, ఎప్పుడంటే అప్పుడు నిధులు మంజూరు చేస్తామని, కొడంగల్ భూములు కృష్ణా జలాలతో తడవాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కొడంగల్‌లో రూ.110 కోట్లతో శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సీఎం రేవంత్ శుక్రవారం భూమి పూజ చేశారు. దౌల్తాబాద్‌లో రూ.2.16 కోట్లతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గిలో రూ.2 కోట్లతో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం, హకీంపేట్‌లో రూ.255 కోట్లతో నిర్మించనున్న 430 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు ఆయన అక్కడే భూమి పూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. "కొడంగల్ నుంచి అనేక మంది వలసలు పోయారు. ఇది రాష్ట్రంలోనే ఎత్తయిన ప్రాంతం. నీళ్లు వచ్చే అవకాశం లేదు. కందులు తప్ప వడ్లు పండించే పరిస్థితి లేదు.

ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టుకోలేని అమాయకత్వం కొడంగల్ ప్రజలది. ఇప్పుడు దేశంలో అభివృద్ధి చెందిన నియోజకవర్గాన్ని ఎవరైనా చూడాలనుకుంటే కొడంగల్‌కు వెళ్లి రావాలనిపించేలా.. ఇతరులు అసూయ పడేలా అభివృద్ధి చేసుకుందాం" అని పిలుపునిచ్చారు. వికారాబాద్ రైల్వే లైన్ ప్రక్రియ 90 శాతం పూర్తయిందని, మరో రెండు నెలల్లో రైల్వే లైన్ పనులు కూడా ప్రారంభం కానున్నాయని చెప్పారు. కొడంగల్ ప్రాంతంలో సున్నపు రాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయని, ఆరు నెలల్లో టేకుల్‌కోడ్ వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కాబోతోందని, తద్వారా ఎంతో మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. రెండేళ్లలో దేశంలోని పెద్ద, పెద్ద పరిశ్రమలు లగచర్ల మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు రానున్నాయని, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి కోస్గి వరకు 330 ఫీట్ల రహదారి నిర్మాణం జరగనుందని చెప్పారు. కొడంగల్ ప్రాంతం ఇప్పుడు ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని, లగచర్ల వద్ద 220 ఎకరాలను కేటాయిస్తున్నామని తెలిపారు. మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్ కాలేజీలు, పాలిటెక్నిక్, సైనిక్ స్కూల్ వంటి విద్యా సంస్థలు కొడంగల్‌లో ఏర్పాటవుతున్నాయని, ఉన్నత చదువులకు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు కొడంగల్‌కు వచ్చేలా చేస్తున్నామని చెప్పారు. అన్ని అభివృద్ధి పనులను 2027 డిసెంబరుకు పూర్తి చేయాల్సిందేనని అధికారులను ఆదేశించారు.

## తిరుపతి సంప్రదాయమే కొడంగల్‌లోనూ...

కొడంగల్‌లోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలకు కూడా పేదల తిరుపతిగా పేరుగాంచిందని గుర్తు చేశారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగం కావడం తన జన్మలో మళ్లీ రాని అవకాశమని, ఈ దేవాలయం పేరు ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో నిలబెట్టడానికి పునర్నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. తిరుపతిలో ఏ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తారో అదే సంప్రదాయం ప్రకారం కొడంగల్ దేవాలయంలో పూజలు కొనసాగాలని స్పష్టం చేశారు. కొడంగల్ అంటే ఒకవైపు గుడి, మరోవైపు గడి అని, రెండూ ఏకమై నందనవనంగా పాడిపంటలతో విలసిల్లేలా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతో తాను ముఖ్యమంత్రిగా నిలబడ్డానని, అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు.

## గ్రూపులు, గుంపులు పక్కనబెట్టండి

సర్పంచులు ఏ పార్టీ నుంచి గెలిచినా గ్రామాల్లో మాత్రం అభివృద్ధి పనులు చేసుకోవాలని, ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తర్వాత అంతా అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. 2034 వరకు గ్రూపులు, గుంపులను పక్కనబెట్టి నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని అన్నారు. "రాజకీయాలను పక్కన పెట్టండి. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. అందరం కలిసి ఈ ప్రాంత అభివృద్ధి కోసం పనిచేద్దాం. చిన్న చిన్న సమస్యలున్నా పట్టించుకోవద్దు. రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా ఉంటే ఎన్ని వందల కోట్లయినా తెచ్చి ఖర్చు పెట్టే పరిస్థితి ఇప్పుడు ఉంది" అని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనరసింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# కలసికట్టుగా కదంతొక్కుదాం

మొదటి పేజీ తరువాయి

చేసుకున్న ప్రయాణికులకు ఒక్కొక్కరికీ పెరిగే అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. తమ ప్రభుత్వానికి హిందూ-ముస్లిం అనే భేదాభిప్రాయాలు లేవన్నారు. గత ఏడాది హజ్ యాత్రకు వెళ్లి బస్సు ప్రమాదంలో 44మంది మరణించారని, మృతుల కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకుందని గుర్తుచేశారు. విదేశీ విద్యలోనూ మైనారిటీలకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామన్నారు. వైట్ కాలర్ ఉద్యోగాల కంటే, ప్రస్తుతం బ్లూ కాలర్ జాబ్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉందని, అమెరికా కంటే జర్మనీ, జపాన్ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీ కాలేజీలు

రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని, వాటిలో స్కిల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సుల శిక్షణకు ప్రా ధాన్యమివ్వాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా విద్యార్థుల జీవనోపాధికి ఉపయోగపడేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్న విధంగానే మైనారిటీ విద్యార్థులకు కూడా ప్రోత్సాహకాలు అందించాలని, ఇందుకు ప్రత్యేకంగా ఓ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. గ్రూప్-1, 2, 3కి ఎంపికైన మైనారిటీల్లో ఆసక్తి ఉన్నవారిని ఎంపిక చేసి, మైనారిటీ సంక్షేమశాఖలో బాధ్యతలు అప్పగించి.. ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన ఉండేలా వారిని తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని ఆదేశించారు. లభ్యత ఉన్నచోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామన్నారు. డీజిల్, పెట్రోల్ ఆటోలకు ఎలక్ట్రిక్ ఇంజిన్లు బిగిస్తే.. ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు ఉండవని, తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఈ దిశగా ఓ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

# ఆగస్టులోగా 'మూసీ' ఆరంభించాలి

**నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా**
**మూసీ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మార్చుకోవాలి**
**పనులు అత్యంత పారదర్శకంగా చేపట్టాలి**
**ప్రజల భాగస్వామ్యంతో సాకారం చేయాలి**
**వచ్చే ఆగస్టులో పనులు ప్రారంభించాలి**
**అధికారులతో భేటీలో క్యాబినెట్ సబ్ కమిటీ**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు తొలిదశలో భాగంగా 21 కిలోమీటర్లలో ఎలాంటి ఇబ్బందిలేని ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని క్యాబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు, ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఫేజ్-1 పనులు చేపట్టనున్న విషయాన్ని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదని, అది ఒక సామాజిక బాధ్యత అని సబ్ కమిటీ పేర్కొంది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదని, వా రిని భాగస్వాములను చేయడమని తెలిపింది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్‌ను మార్చుకోవాలని సూచించింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించింది. ప్రాజెక్టు పనులను అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముం దుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. శుక్రవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అధ్యక్షతన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని ఆదేశించింది. ప్రజా ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేసింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు నష్టం కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోందని తెలిపింది. మూసీ పునరుజ్జీవం ద్వారా నగర రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని పేర్కొంది. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారమవుతుందని, అభివృద్ధి, ప్రజాహితం.. రెండూ సమాంతరంగా సాగాలని అధికారులకు సూచించింది.

## ఐదు దశల్లో ప్రాజెక్టు..

మూసీ ప్రాజెక్టును 5 దశల్లో 55 కిలోమీటర్ల మేర చేపట్టనున్నారు. తొలిదశ పనుల కోసం రూ.7,055 కోట్లను ఏషియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నుంచి సేకరించడానికి సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు.. మంత్రులకు తెలిపారు. కాగా, గాంధీ సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయించుకునే అంశంపై చర్చించారు. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లపై హోర్డింగులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుకు అనుసంధానమైన విభాగా ల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని వచ్చే ఆగస్టులో పనులను ప్రారంభించడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఈ బృహత్తర ప్రాజెక్టు ను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. కాగా, ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లాలని మంత్రి శ్రీధర్‌బాబు అధికారులకు సూచించారు. సాంకేతికపరమైన అం శాలలో ఐఐటీ, జేఎన్‌టీయూల నుంచి తగిన సూచనలు తీసుకోవాలన్నారు. వర్షకాలా న్ని దృష్టిలో ఉం చుకుని నిర్మాణ పనులకు ఆటంకాలు కలగకుండా జాగ్రత్తపడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## రబ్బర్ డ్యాం నమూనా పరిశీలన..

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా పర్యాటక అభివృద్ధికి సంబంధించి పలు చోట్ల చెక్‌డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచి, జల క్రీడలు, బోటింగ్ సదుపాయాలు కల్పించాలన్నది ఉద్దేశం. ఒబెర్ మేయర్ స్పిల్‌వే గేట్ టెక్నాలజీ సంస్థ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్‌లో మంత్రులు పరిశీలించారు. నాసిక్, ముంబై నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మించిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి, తగిన అధ్యయనం చేసిన తర్వాత నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. కాగా, మధు పార్క్ రిడ్జ్(బి-బ్లాక్) రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజాభవన్‌లో క్యాబినెట్ సబ్ కమిటీ మంత్రులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహలను మంత్రులు నివృత్తి చేశారు. మధు పార్క్ రిడ్జ్ బి-బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చదనం అందించేందుకే మూసీ ప్రాజెక్టును చేపట్టామని, ఆ ప్రాజెక్టులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# మాజీ ఐపీఎస్ భార్య దారుణ హత్య

**మళ్లీ పేట్రేగిన నేపాలీ ముఠా**
**ఎనిమిది నెలల క్రితం పనిలో**
**చేరిన నేపాల్ మహిళ కల్పన**
**అర్ధరాత్రి ఇంట్లోకి ఇద్దరు**
**అనుచరుల్ని రప్పించిన వైనం**
**నేపాలీలతో జాగ్రత్త: సజ్జనార్**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** నేపాల్ పనిమనుషులు! ఈ పేరెత్తితేనే భయంతో వణికిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి! చెప్పిన ఇంటి పనులన్నీ చక్కగా చేస్తూ యజమానుల నమ్మకాన్ని చూరగొంటున్న నేపాలీలు అదను చూసి.. ఇంట్లోని మనుషులకు హాని తలపెట్టి, అందినకాడికి దోచుకొని వెళుతున్నారు. ఇలాంటి రెండు ఘటనలకు ఇటీవల సాక్షీభూతంగా నిలిచిన హైదరాబాద్‌లోనే మరో ఘోరం జరిగింది. ఇంట్లో ఎంతో నమ్మకంగా పనిచేస్తున్న నేపాల్ మహిళ, ఆ ఇంటి యజమాని భార్యను దారుణంగా హత్య చేసింది. జూబ్లీహిల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఈ దారుణం జరిగింది. హతురాలు విశ్రాంత ఐపీఎస్ అధికారి సతీమణి! ఈ ఘటనను పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. డీజీపీ ఆనంద్, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. గతంలో అక్కడ పనిచేసి మానేసిన నేపాల్ మహిళను ప్రశ్నించిన మీదట ఈ దారుణానికి ఒడిగట్టింది నేపాలీ ముఠా పనేనని తేల్చారు. ఇంట్లో పనిచేస్తున్న కల్పన అనే నేపాల్ మహిళ పథకం ప్రకారం యజమాని లేని సమయం చూసి, తన అనుచరులు ఇద్దరిని పిలిపించుకొని హత్యకు ఒడిగట్టిందని ప్రాథమికంగా నిర్ధారించారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు హత్య ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. సీపీ సజ్జనార్, విచారణలో మాజీ పనిమనిషి వెల్లడించిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని మూడంతస్తుల భవనంలో ఏపీ క్యాడర్‌కు చెందిన డీజీపీ స్థాయి విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే, ఆయన భార్య తనూజ అలియాస్ సునంద (55), వారి ఇద్దరు కూతుళ్లు ఉంటున్నారు. వినయ్ 2019లో ఉద్యోగ విరమణ చేశారు. గతంలో ఆ ఇంట్లో మీనా అనే నేపాల్ మహిళ పనిచేసేది. వినయ్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటంతో పనిలో సాయంగా ఉండేందుకు తోడుగా మరో మహిళను తెచ్చుకోవాలని మీనాకు తనూజ సూచించారు. దీంతో మీనా.. పుణెలో పనిచేస్తున్న నేపాల్‌కే చెందిన కల్పనను 8నెలల క్రితం రప్పించి.. ఆ ఇంట్లో తనకు తోడుగా పనిలో చేర్పించింది. కొన్నాళ్లకు మీనా ఆ ఇంట్లో పని మానేసింది. వినయ్ గురువారం వ్యక్తిగత పనిమీద బెంగళూరు వెళ్లారు. ఆ రోజు రాత్రి తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లోని తన గదిలో నిద్రించారు. ఆమె ఇద్దరు కూతుళ్లు పై అంతస్తుల్లోని గదుల్లో పడుకున్నారు. అర్ధరాత్రి తర్వాత కల్పన.. బయట నుంచి తన అనుచరులు ఇద్దరిని ఇంట్లోకి పిలిపించుకుంది. సీసీ కెమెరాలో కనిపించకుండా ఉండేందుకు పథకం ప్రకారం ఆ ఇద్దరు పార్కు నుంచి ఓ చిన్న గేటు ద్వారా ఇంట్లోకి ప్రవేశించారు. తనూజను బంధించడానికి గుడ్డ పీలికలను వెంట తెచ్చుకున్నారు. అనంతరం ముగ్గురు కలిసి.. తనూజ గదిలోకి వెళ్లారు. అక్కడ గాఢ నిద్రలో ఉన్న తనూజ చేతులు, కాళ్లు కట్టేసి.. నోట్లో గుడ్డలు కుక్కారు. ఈ ఘటనలో ఊపిరాడకపోవడంతో ఆమె మృతిచెందారు. అనంతరం కల్పన, మరో ఇద్దరు కలిసి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, డబ్బును మూటగట్టుకొని ఇంట్లోంచి చిన్న గేటు ద్వారా. పార్కులోకి ప్రవేశించి అక్కడి నుంచి పారిపోయారు. పై అంతస్తులో కూతుళ్లు నిద్రలేచి.. వచ్చి చూడటంతో తెల్లవారుజామున ఐదు గంటలకు హత్యోదంతం బయటపడింది. కల్పన గ్యాంగ్ ఆటకట్టించేందుకు పది ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. కొన్ని బృందాలు పుణెకు, కొన్ని నేపాల్‌కు వెళ్లాయి. కాగా పార్క్ రూట్ నుంచి బయటపడిన దొంగల ముఠా ఓ ఆటోను పట్టుకుని.. మహాప్రస్థానం మీదుగా నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నట్లు, అక్కడి నుంచి ఢిల్లీ మీదుగా నేపాల్ వెళ్లేందుకు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎక్కినట్లు తెలిసింది. ఇప్పటికే విమానాల్లో కొన్ని పోలీసు బృందాలు నేపాల్ చేరుకోగా, మరికొన్ని పోలీసు బృందాలు తెలంగాణ ఎక్స్‌పట్రెస్‌ను ఛేజ్ చేస్తూ ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారంతో కల్పన గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. నేపాల్‌లో తనది, కల్పనది సమీప గ్రామాలు అని విచారణలో మాజీ పనిమనిషి మీనా చెప్పింది. కల్పన పనిలో చేరిన కొన్నాళ్లకు తనూజ తనను పిలిచి.. కల్పన సరిగా పనిచేయడం లేదని, గంటలకొద్దీ బయటే ఉంటోందని, మరో పనిమనిషిని చూడాలని చెప్పిందని మీనా వెల్లడించింది.

## నేపాల్ పనిమనుషులతో జాగ్రత్త

నేపాల్ పనిమనుషులతో అప్రమత్తంగా ఉండాలని తాను హెచ్చరిస్తూనే ఉన్నానని సీపీ సజ్జనార్ చెప్పారు. హైదరాబాద్‌లోనే కాకుండా, ఇతర రాష్ట్రాల్లోని నగరాల్లో నేపాలీలు ఇళ్లలో దోపిడీలకు తెగబడుతున్నారని చెప్పారు. ఏడాది నుంచో, రెండేళ్ల నుంచో ఇళ్లలో నేపాలీలు పనిచేస్తున్నా యజమానులు గుడ్డిగా నమ్మకుండా వారి పూర్తి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. నేపాలీ ముఠాలు తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి నెలల తరబడి ఓపిగ్గా వేచిచూస్తాయని, ఇంట్లో మగవాళ్లు లేనపుడు తమ పనికానిచ్చేస్తారని వివరించారు. పనిమనుషుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

## జీబన్ లేదా బహదూర్ ముఠా పనే?

మాజీ ఐపీఎస్ అధికారి భార్య హత్య, సొత్తు దోపిడీ ఘటనకు నేపాల్‌కు చెందిన జీబన్ ముఠా లేదా బహదూర్ ముఠాతో సంబంధం ఉండొచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ముఠాలు పథకం ప్రకారం హైదరాబాద్‌లోని ధనవంతుల ఇళ్లలో నేపాలీలను పనికి కుదుర్చుతున్నాయని, అదను చూసి దోపిడీకి పాల్పడేలా ఉసిగొల్పుతున్నాయని పోలీసులు గుర్తించారు. ఈ రెండు గ్యాంగ్‌లకు చెందిన ముఠా సభ్యులు బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో ఉంటూ అక్కడి నుంచే దోపిడీలు చేయిస్తున్నారని చెబుతున్నారు. ఒకసారి దోపిడీ సొత్తుతో దేశ సరిహద్దు దాటి దుండగులు నేపాల్‌లో ప్రవేశిస్తే.. వారిని పట్టుకోవడం అసాధ్యం అవుతుంది. నేపాల్ పోలీసులు దుండగలను అప్పగించడం లేదు. తామే విచారణ చేసి శిక్షిస్తామని చెబుతున్నారు.

# రాష్ట్రంలో మోదీ మేనియా

**2, 3 నెలల్లోనే మార్పులు చూస్తారు**

**తెలంగాణలో బెంగాల్ జోష్ కొనసాగిస్తాం**

**బీజేపీ నేతల వ్యాఖ్యలు..**

**రేపు పరేడ్‌గ్రౌండ్‌లో మోదీ సభ**

**రాష్ట్రానికి మోదీ రూ.8 వేల కోట్ల అభివృద్ధి కానుక: రాంచందర్‌రావు**

**మోదీ సభను విజయవంతం చేయండి**

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు**

**మోదీతో కలిసి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం రేవంత్**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులకు ప్రధాని మోదీ పర్యటన అంకురార్పణ చేయబోతోందని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆయన పర్యటన తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయని అంటున్నారు. అది కూడా రెండుమూడు నెలల్లోనే జరగబోతోందని పేర్కొంటున్నారు. వ్యూహాత్మకంగానే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో మోదీ బహిరంగసభను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. బెంగాల్‌లో పార్టీ విజయబావుటా ఎగురవేయబోతున్నట్లు స్పష్టత వచ్చిన రోజే తెలంగాణలో సభను ఖరారు చేసినట్లు ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు చెప్పారు. అస్సాం, బెంగాల్‌లో సాధించిన విజయ పరంపరను తెలంగాణలో కొనసాగించేందుకు అంతర్గత కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. 'రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు అనుసరించబోయే కార్యాచరణలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ దశలవారీగా పర్యటించబోతున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో పాటు పార్టీ అగ్రనాయకులు విస్తృత పర్యటనలు చేయబోతున్నారు. ఇక్కడ పార్టీ కార్యక్రమాలను అగ్రనాయకులు స్వయంగా పర్యవేక్షించనున్నారు' అని పార్టీ కీలక నేత ఒకరు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే సభలో ప్రధాని పాల్గొంటారు.

### 8 వేల కోట్ల పనులకు ప్రారంభం

ప్రధాని మోదీ రాష్ట్రంలో దాదాపు రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. హెచ్ఐసీసీలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచే జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ, ఎన్‌హెచ్-167 (గూడబల్లేరు-మహబూబ్‌నగర్) విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కు (వరంగల్)తో పాటు మల్కాపూర్ గ్రీన్‌ఫీల్డ్ పెట్రో టెర్మినల్‌ను ప్రారంభిస్తారు. కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాక్ ప్రాజెక్టు (118 కి.మీ.), కాజీపేట ఆర్‌యూబీ బైపాస్ లైన్ (21 కి.మీ.లు)ను జాతికి అంకితం చేస్తారు. ప్రధాని పాల్గొనే అధికారిక కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పాల్గొంటారు. ఈ సందర్భంగా తాము తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్‌ను 150 మీటర్ల ఎత్తులో నిర్మించుకొనేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ప్రధానికి సీఎం వినతిపత్రం అందించే అవకాశం ఉందని సమాచారం.

### మోదీ సభకు భారీ ప్రచారం

ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. హైదరాబాద్ నగరాన్ని వాల్‌రైటింగ్స్, వాల్‌పోస్టర్లు, హోర్డింగులతో నింపేశారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి జిల్లాల నుంచి భారీగా జనాన్ని తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, ఈటల రాజేందర్ తదితర నేతలు నియోజకవర్గాలవారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ నేతృత్వంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎక్స్‌రోడ్ నుంచి అమీర్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 10 వేల మందిని సభకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పరేడ్‌గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ ప్రజల్లోనూ బీజేపీకి అధికారం కట్టబెట్టాలనే సంకల్పం కనిపిస్తోందని తెలిపారు. మోదీ సభకు సుమారు 2 లక్షల మంది వస్తారని చెప్పారు. కిషన్ రెడ్డి రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాని సభను జయప్రదం చేయాలని కోరారు. ప్రధాని సభకు 2వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి కమీషనరేట్ పరిధిలోని డీసీపీ శ్రీధర్ తెలిపారు. నగరంతోపాటు సభా ప్రాంగణం ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

# ఫాం హౌస్ డ్రగ్స్ కేసులు మాకైతే తెలువదు

**ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు**

**రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల: సంజయ్**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారంవల్లే ఆయన తండ్రి కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కేటీఆర్‌ను చూసి బీఆర్ ఎస్ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రధాని రాక సందర్భంగా బండి నేతృత్వంలో శుక్రవారం ఆర్టీసీ ఎక్స్‌రోడ్ నుంచి అమీర్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కేటీఆర్ మాదిరిగా దోచుకోవడం నాకు తెలియదు.. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం నాకు తెలియదు.. డ్రగ్స్ తీసుకోవడం నాకు తెలియదు.. కాళేశ్వరం, ఈ-ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి మాకు తెలియదు.. ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు.. మంది కొంపలు ముంచడం అసలే తెలియదు.. ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం మాకు తెలియదు.. మాకు ఏం తెలుసో ప్రజలు నిర్ణయిస్తారు. మీకు ఏం తెలుసో ప్రజలు గ్రహించి మిమ్మల్ని ఓడించారు' అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అహంకారం చూపించి, ఇప్పుడు అధికారం పోయాక కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కాళ్లు మొక్కుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏం చేసినా రాష్ట్రంలో ఇక అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తాము నిధులు తెస్తుంటే... కాంగ్రెస్ నేతలు తెలంగాణ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోటి దురుసుతనమే తమ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ అన్నారు.

# అన్నిట్లో 'రేవంత్' అట్టర్ ప్లాప్

**దేశంలో అత్యధికంగా 27,230 సైబర్ నేరాల నమోదు**

**ఎన్‌సీఆర్‌బీ నివేదికతో బయటపడిన నేరాల రేటు: హరీశ్**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ముఖ్యమంత్రిగానే కాకుండా రాష్ట్ర హోంశాఖ మంత్రిగానూ రేవంత్ విఫలమయ్యారని, తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. 2024 ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న రాష్ట్రంగా మారడం ఆందోళనకరమన్నారు. 2024లో తెలంగాణలో 27,230 సైబర్ నేరాలు నమోదవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సీపీ సుమతి నిర్వహించిన ఆపరేషన్‌తో హైదరాబాద్‌లో మహిళల భద్రత ఎంత డొల్లగా మారిందో బయటపడిందని, జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షలు నిర్వహించడం మాత్రమే కాకుండా, క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతలను కాపాడటంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

# జలాల పేరిట బీఆర్ఎస్ దోపిడీ

**ఆంధ్రోళ్లను తిట్టి ఓట్లు.. ప్రాజెక్టుల పేర కమీషన్లు దండుకున్నారు**

**పాలమూరుకు 33 వేల కోట్లు ఖర్చు.. 33 ఎకరాలకూ నీరివ్వలే**

**డిజైన్ల మార్పు, ప్రాజెక్టుల పేరిట కమీషన్లు మింగేసిన గుంటనక్క**

**నల్లమల పులిబిడ్డ కూడా పాలమూరులో తట్టెడు మట్టి ఎత్తలేదు**

**పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో కవిత**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** "ఆంధ్రోళ్లను తిట్టి ఓట్లు దండుకున్న బీఆర్ఎస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుల పేరిట కమీషన్లు దండుకుంది. పదేళ్ల అధికారంలో జలాల పేరుతో దోపిడీకి పాల్పడింది. అంతే తప్ప.. పాలమూరు- రంగారెడ్డి జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదు. కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. ప్రాజెక్టుల పేరుతో ఓ గుంటనక్క కమీషన్లు మింగేసింది. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై డిజైన్లను మార్పు చేసింది" అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి కనీసం 33 ఎకరాలకు కూడా సాగు నీరు అందించలేదని దుయ్యబట్టారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్- చౌదరిగూడ మండల కేంద్రంలో శుక్రవారం 'రంగారెడ్డి- పాలమూరు ప్రాజెక్టు సాధన సభ'ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. "జూరాల నుంచి కృష్ణా జలాలను వాడుకునేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి చివరి ఆశాకిరణం కిరణ్‌కుమార్‌రెడ్డి జీవో నంబరు 72 ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ బేషజాలకు పోయి సోర్స్ పాయింట్‌ను శ్రీశైలానికి మార్చింది. క్షమించరాని నేరం చేసింది. పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రజల ఆశలను బొంద పెట్టింది. అప్రోచ్ చానల్ 140 మీటర్లు ఉండాల్సి ఉంటే.. 50 మీటర్లకు కుదించింది. ఓ గుంటనక్క కమీషన్ల కోసం ఇదంతా చేసింది" అని మండిపడ్డారు. కమీషన్ల కోసం నీళ్లు తీసుకునే ఎత్తును కూడా పెంచడం దుర్మార్గమన్నారు. సోర్స్ పాయింట్‌ను శ్రీశైలానికి మార్చడం ద్వారా మనకు ఆంధ్రోళ్లతో పంచాయితీ అవుతోందన్నారు ఈ 12 ఏళ్లలో కృష్ణా నది నుంచి పాలమూరు ఆయకట్టుకు చుక్క నీరు అందించలేదని, రాష్ట్రంలో ఇతర ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇలానే ఉందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీళ్లు ఇవ్వలేదన్నారు. స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన ప్రతి ఒక్కరూ రాబోయే రోజుల్లో నీటి యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కింద 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే రంగారెడ్డి జిల్లాలో 4 లక్షలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 7 లక్షల ఎకరాలకు నీళ్లు అందించవచ్చన్నారు. ఈ పనులను దసరాలోపు ప్రారంభించకపోతే పాదయాత్ర చేసి కాంగ్రెస్ ను ఎండగడతామని హెచ్చరించారు. కృష్ణమ్మ నీరంతా ఆం2ధ్రాకే వెళ్లిపోతోందని, పాలమూరుకు మాత్రం రావడం లేదని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే దీనికి కారణమని విమర్శించారు. భీమా, నెట్టెంపాడు, కోయల్‌సాగర్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. తన విమర్శలపై గులాబీ దండు దాడి చేయడమే తప్ప సరైన సమాధానం ఇవ్వదని ఆక్షేపించారు.

### నల్లమల పులి బిడ్డ తట్టెడు మట్టి ఎత్తిపోయలేదు

నల్లమల పులి బిడ్డనని చెప్పుకునే సీఎం రేవంత్ రెండున్నరేళ్లలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టెడు మట్టిని ఎత్తిపోయలేదని కవిత విమర్శించారు. కానీ ప్రాజెక్టు పేరుతో రూ.6వేల కోట్ల బిల్లులు చెల్లించి, కమీషన్లు కొట్టేశారని.. ఇందులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ జల ద్రోహానికి వచ్చే ఎన్నికల్లో పాలమూరు ప్రజలు కిలోమీటర్ లోతున బొందపెట్టడం ఖాయమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్ కమిషన్ వేస్తామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తోపాటు బీజేపీ కూడా తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. పాలమూరు- రంగారెడ్డి పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని ఈనెల 10న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# తలసేమియా అంటు వ్యాధికాదు

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** తలసేమియా అంటువ్యాధి కాదని.. ఇది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైన వ్యాధి అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. సమీప బంధువుల మధ్య వివాహాలు జరిగే సందర్భాల్లో ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుందన్నారు. యువత వివాహానికి ముందు తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. కొత్తగా వివాహమైన దంపతులకు కూడా జన్యుపరమైన, ఇతర వ్యాధులపై అవగాహన అవసరమని వెల్లడించారు. తలసేమియా, ఇతర జన్యుపరమైన వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే సికిల్‌సెల్ వ్యాధిపై దాదాపు 11 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ హాస్పిటళ్లలో ఉచితంగా చికిత్స, అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. తలసేమియా బాధితులకు క్రమం తప్పకుండా రక్త మార్పిడి

# దేశమంతా కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకుంది

**తెలంగాణ మాత్రం నెత్తిన పెట్టుకుంది**

**కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**రాజన్న సిరిసిల్ల, మే 8 :** దేశమంతా కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ దరిద్రాన్ని నెత్తిపై రుద్దుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు ఆగమవుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో నోటిఫికేషన్లు లేవని తెలిపారు. మేమేం తప్పు చేశామని అరెస్టు చేస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్‌కు కంటిలో నలుసులా తయారయ్యామని అరెస్టు చేస్తారా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలేవి? రైతు డిక్లరేషన్ సంగతి ఏమైందని నిలదీశారు. బీఆర్ఎస్ ఆందోళనతో కాంగ్రెస్ ఆగమైతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బావుసింగ్ భూక్య తండాలో శుక్రవారం జరిగిన జగదాంబ మాత సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా వీర్నపల్లిలో కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ తెలిపారు. మన ప్రభుత్వం లేకున్నా గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మనకు మళ్లీ మంచిరోజులు తిరిగి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌ది దండుపాళ్యం ముఠా అని విమర్శించారు. మేడారం అభివృద్ధి పనుల్లో వాటాల కోసం మంత్రులు కొట్లాడుకున్నారని గుర్తుచేశారు. ఏ ఊరికి వెళ్లినా మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఒక్క ఓటు తప్పునకు ఐదేళ్ల శిక్ష తప్పదని.. ఓపిక పట్టాలని సూచించారు.

ఇవాళ ఏవారం.. రేపు ఏవారం తప్ప బీజేపీ వాళ్లకు ఏమీ తెలియదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ కాదు.. తొండి సంజయ్ అని విమర్శించారు. బండి సంజయ్ ఎక్కడైనా ఒక బడి, ఒక గుడి కట్టించారా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో యాదాద్రిని అద్భుతంగా నిర్మించామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో భూముల విలువ పడిపోయిందని అన్నారు.

## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

**నగరంలో వరుస హత్యలు ఆందోళనకరం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు**

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# తమిళనాట దాగుడుమూతలు

**మలుపులు తిరుగుతున్న తమిళ కథా చిత్రం**
**మద్దతు కూడగట్టడంలో విజయ్ విఫలం**
**ముఖ్యమంత్రి పీఠంపై అవే దాగుడు మూతలు**
**కాంగ్రెస్‌తోపాటు కొత్తగా సీపీఐ, సీపీఎం మద్దతు**
**వరుసగా మూడోరోజు గవర్నర్‌తో విజయ్ భేటీ**
**116 మంది ఎమ్మెల్యేల జాబితా సమర్పణ**
**ఐయూఎంఎల్, వీసీకే మద్దతుపై సంకేతాలు**
**ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ అని వార్తలు**
**టీవీకేకు మద్దతుపై ఐయూఎంఎల్, వీసీకే ససేమిరా**
**తాము డీఎంకేతోనే ఉంటామని తేల్చి చెప్పిన నేతలు**
**లోక్‌భవన్ నుంచి వెలువడని అధికారిక ప్రకటన**
**అర్ధరాత్రి లోక్‌భవన్‌కు దినకర్.. కారణమేమిటో!?**



**చెన్నై :** తమిళనాడులో నడుస్తున్న 'హంగ్' రాజకీయం సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపింపజేస్తోంది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధిపతి విజయ్‌తో 'సీఎం పీఠం' దోబూచులాడుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలాన్ని సాధించడంలో విజయ్ తడబాటు కొనసాగుతూనే ఉంది. వరుసగా మూడోరోజు శుక్రవారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను విజయ్ కలిశారు. ఆ వెంటనే... 'అంతా ఓకే... సంబరాలు చేసుకోండి' అంటూ టీవీకే కార్యకర్తలకు సంకేతాలు వెళ్లాయి. ఐదు స్థానాలున్న కాంగ్రెస్‌తోపాటు కొత్తగా రెండేసి స్థానాలున్న సీపీఐ, సీపీఎం కూడా టీవీకేకు మద్దతు ప్రకటించాయి. రెండేసి స్థానాలున్న వీసీకే, ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు వార్తలు రావడంతో కథ సుఖాంతం అని అంతా భావించారు. 'ప్రభుత్వ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్' అంటూ వార్తలు వెలువడ్డాయి. 'శనివారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం' అంటూ ముహూర్తం కూడా పెట్టేశారు. కానీ... అసలు లెక్క తేలనేలేదు. తాము డీఎంకేతోనే ఉన్నామని వీసీకే, ఐయూఎంఎల్ స్పష్టం చేశాయి. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానంపై శుక్రవారం అర్ధరాత్రిదాకా లోక్‌భవన్ నుంచి ప్రకటన విడుదల కాలేదు. కథ మళ్లీ మొదటికి వచ్చింది.

### వరుస మలుపులు...

ప్రభుత్వ ఏర్పాటు వ్యవహారం శుక్రవారం ఉదయం నుంచే అనేక మలుపులు తిరిగింది. ఫలితాలు వెలువడి ఇప్పటికే 4రోజులు గడిచినా... తగిన సంఖ్యాబలాన్ని నిరూపించుకోవడంలో విజయ్ విఫలమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం వరకు గడువు ఇస్తున్నామని, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు లేఖలు సమర్పించాలని లోక్‌భవన్ నుంచి టీవీకేకు సమాచారం వెళ్లినట్లు తెలిసింది. ఇదే సమయంలో చెన్నైకి బయలుదేరిన అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి మధ్యాహ్నం తరువాత గవర్నర్‌ను కలవాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు అపాయింట్‌మెంట్ కూడా కోరారు. అదే సమయంలో డీఎంకే కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సీనియర్లతో భేటీ అయి పరిస్థితిని సమీక్షించారు. వీటన్నింటి నేపథ్యంలో విజయ్‌కి నిరాశ తప్పదని అన్ని వర్గాలు భావించాయి. దీనికి తోడు టీవీకే నేత బుస్సీ ఆనంద్.. తమ పార్టీ ఎమ్మెల్యేల వద్ద భావోద్వేగ ప్రసంగం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా అందరూ విజయ్ వెంట ఉండాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఏదో జరగబోతోందని... అన్నాడీఎంకే నేతలు ప్రకటించినట్లుగా ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కానుందనే భావన కూడా వ్యక్తమైంది. అయితే, ఈలోపు సీపీఐ, సీపీఎం జాతీయ నాయకత్వం రంగంలోకి దిగింది. విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన చర్యలకు తాము అండగా నిలుస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. తమ పార్టీ రాష్ట్ర శాఖ సాయంత్రంలోపు తగిన నిర్ణయం తీసుకుంటుందని, తమతో పాటు సీపీఐ, వీసీకే పార్టీలు కూడా విజయ్‌కి అండగా నిలుస్తాయని ప్రకటించారు. ఆయన ప్రకటించిన కొద్దిసేపటికే సీపీఎం, సీపీఐ పార్టీలు టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి. లేఖలూ అందించాయి.

### బయటి నుంచే వామపక్షాల మద్దతు

టీవీకేకు బయటి నుంచే మద్దతు ఇవ్వనున్నట్లు సీపీఐ నేత వీరపాండ్యన్, సీపీఎం నేత షణ్ముగం ప్రకటించారు. వారిద్దరూ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. తమిళనాట రాష్ట్రపతి పాలన రాకూడదని, బీజేపీ కూటమి పార్టీ అధికారంలోకి రాకూడదన్న ఉద్దేశంతో తాము టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని వివరించారు. తాము మంత్రి పదవులు తీసుకోబోమని, బయటి నుంచే మద్దతు ఇస్తామని తెలిపారు. అదే సమయంలో... తాము ఇప్పటికీ డీఎంకే కూటమిలోనే ఉన్నామని స్పష్టం చేశారు. టీవీకేకు మద్దతుపై స్టాలిన్‌తో చర్చించారా అని మీడియా అడగ్గా.. తమ పార్టీ నిర్ణయం గురించి స్టాలిన్‌తో చర్చించాల్సిన అవసరమేముందని వీరపాండ్యన్ వ్యాఖ్యానించారు.

### గవర్నర్‌కు లేఖల సమర్పణ

ఈ ఎన్నికల్లో టీవీకే 108 మంది స్థానాల్లో నెగ్గింది. అయితే, ఆ పార్టీ అధినేత విజయ్ రెండు చోట్ల పోటీ చేసినందున ఒకదానిని పక్కనబెడితే 107 మంది ఎమ్మెల్యేలు వున్నట్లు లెక్క. ఇక కాంగ్రెస్‌కు 5, సీపీఐ 2, సీపీఎంకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నందున మెజారిటీ 116కు చేరింది. ఆ వివరాలను అందించేందుకు విజయ్ గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. గవర్నర్ అర్లేకర్ సాయంత్రం 4.30 గంటలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. కానీ... సీపీఐ, సీపీఎం పార్టీల మద్దతుతో కూడిన లేఖలు అందడంలో జాప్యం కావడంతో సాయంత్రం 6.30 గంటలకు విజయ్ గవర్నర్‌ను కలుసుకోగలిగారు. ఎమ్మెల్యేల జాబితాతోపాటు తనకు మద్దతు పలికిన వామపక్షాల లేఖలను గవర్నర్‌కు అందించారు. ఈ సందర్భంగా విజయ్‌ను అభినందించిన గవర్నర్... ఎమ్మెల్యేల జాబితాను పరిశీలిస్తానని తెలిపారు.

### ఆశా... నిరాశ

వామపక్షాలు అధికారికంగానే లేఖలు ఇవ్వడం... వీసీకే, ఐయూఎంఎల్ మద్దతూ తమకే అని టీవీకే నేతలు సంకేతాలు పంపడంతో తమిళనాడు వ్యాప్తంగా ఆ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కానీ... సమయం గడిచేకొద్దీ ఒక్కో విషయం బయటపడుతూ వచ్చింది. టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లుగా వీసీకే ఎలాంటి లేఖా ఇవ్వలేదు. పైగా... ఆ పార్టీ అధినేత తిరుమావళవన్ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో భేటీ అయ్యారు. ఇక... ఐయూఎంఎల్‌దీ అదే పరిస్థితి. 'గవర్నర్ ఏర్పాటు చేయబోయే ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుంది' అని నర్మగర్భ ప్రకటన విడుదల చేసింది. ఆ తర్వాత పార్టీ నేతలు స్టాలిన్‌తో సమావేశమయ్యారు. టీవీకేకు మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు.

కొసమెరుపు: ఉదయం నుంచి రాత్రిదాకా నెలకొన్న పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ... 'విజయ్ సీఎం అవుతారు. ఈ ఐదేళ్లే కాదు... ఆ తర్వాతా ఆయనే సీఎం. మాకు మద్దతు ప్రకటించిన వాళ్లకు థ్యాంక్స్' అని టీవీకే ఎమ్మెల్యే మేరీ విల్సన్ పేర్కొన్నారు. శనివారం విజయ్ ప్రమాణ స్వీకారం ఉంటుందా అని ప్రశ్నించగా... "మేం వందశాతం నమ్మకంతో ఉన్నాం. రాత్రిపొద్దుపోయాక విషయం తెలుస్తుంది' అని చెప్పారు.

### చెన్నై టు బెంగళూరు.. వయా హైదరాబాద్!

ఇలా వచ్చి అలా వెళ్లిన తమిళనాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సాయంత్రం ఆరున్నరకు దిగి రాత్రి 9 గంటలకు వెళ్లిన వైనం తమిళనాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శుక్రవారం చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చి వెంటనే బెంగళూరుకు వెళ్లిపోయారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలనూ ఆ పార్టీ హైదరాబాద్‌కు తరలించింది. శుక్రవారం సాయంత్రం ఆరున్నరకు శంషాబాద్ విమానాశ్రయం చేరుకోగా వారు బయటకు రాకముందే బెంగళూరు వెళ్లాల్సిందిగా కబురు రావడంతో వారు రాత్రి 9గంటలకు తిరుగుపయనమయ్యారు. విజయ్ ప్రమాణ స్వీకారానికి శనివారం అవకాశం ఉండొచ్చనే కారణంతో వారిని పిలుపు వచ్చినట్లు సమాచారం. రోడ్డు మార్గం గుండా చెన్నైకి సులభంగా చేరుకునేలా అందుబాటులో ఉండాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. కాగా తమిళనాడు ఎన్నికల్లో గెలిచిన 5గురు ఎమ్మెల్యేల్లో ఒకరైన విశ్వనాథన్ ప్రస్తుతం ఏఐసీసీ తెలంగాణ ఇంఛార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

## సుప్రీంకు టీవీకే

**ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాల్సిందిగా గవర్నర్‌ను ఆదేశించాలని అభ్యర్థన**
**విజయ్‌ను తప్ప మరే కూటమినీ పిలవకుండా అడ్డుకోవాలని వినతి**
**అత్యవసరంగా విచారించాలని కోరిన ఆ పార్టీ సభ్యుడు ఎళిలరసి**

న్యూఢిల్లీ, మే 8: తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకేను ఆహ్వానించేలా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అతిపెద్ద పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు పిలవకపోవడం రాజ్యాంగంలోని 12, 32 అధికరణలను గవర్నర్ ఉల్లంఘించడమేనని ఎళిలరసి.కె అనే వ్యక్తి శుక్రవారం ఈ వ్యాజ్యం వేశారు. తాను న్యాయవాదినని.. టీవీకే క్రియాశీల సభ్యుడినని తెలిపారు. 'టీవీకే అధినేత సి.జోసెఫ్ విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేయాల్సిందిగా రిట్ ఆఫ్ మాండమస్ గానీ లేదా అలాంటి ఇతర ఆదేశాల ద్వారా తమిళనాడు గవర్నర్‌ను ఆదేశించండి' అని వ్యాజ్యంలో కోరారు. ప్రతివాదులుగా గవర్నర్ ముఖ్య కార్యదర్శిని, రాష్ట్రప్రభుత్వాన్ని, కేంద్రప్రభుత్వాన్ని చేర్చారు. తన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. 'సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రకారం.. అసెంబ్లీలో అతిపెద్ద పార్టీ నాయకుడిని ప్రభుత్వ ఏర్పాటుకు మొదట పిలవడం.. ఆ తర్వాత సభలో మెజారిటీ నిరూపించుకోవాలని చెప్పడం గవర్నర్ కర్తవ్యం. జోసెఫ్ విజయ్ అతిపెద్ద పార్టీ నేత. అయితే ఎన్నికల అనంతరం పొత్తు పెట్టుకుంటున్న సంకీర్ణ పార్టీలను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించబోతున్నారని మీడియా ద్వారా తెలిసింది. సుప్రీంకోర్టు నిర్దేశిత న్యాయసూత్రాలకు ఇది విరుద్ధం. ప్రజాస్వామ్యానికే మృత్యుఘంటిక. ప్రజాస్వామ్య సంరక్షకురాలు సర్వోన్నత న్యాయస్థానమే. టీవీకేని తప్ప మరే రాజకీయ కూటమినీ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకుండా గవర్నర్‌ను నిరోధించాలి' అని ఆయన అభ్యర్థించారు.


# హడలెత్తిస్తున్న హంటా!

**వైరస్ బారినపడి ముగ్గురు మృతి**
**మరో ఐదుగురిలో వ్యాధి గుర్తింపు**
**డచ్‌కు చెందిన విలాస నౌకలో వైరస్ కేంద్రం**
**నౌకా సిబ్బందిలో ఇద్దరు భారతీయులు కూడా**
**భారత్‌కు ముప్పేమీ లేదు : కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, మే 8:** కరోనా మహమ్మారితో కలవరపడ్డ ప్రపంచాన్ని ఇప్పుడు హంటా వైరస్ హడలెత్తిస్తోంది. ఈ వైరస్ బారినపడి భార్యాభర్తలు సహా ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో ఐదుగురిలో వ్యాధిని గుర్తించారు. ఎలుకల విసర్జితాల ద్వారా హంటా విస్తరిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అట్లాంటిక్ సముద్రంలో ప్రయాణిస్తున్న క్రూజ్ నౌక ఎంవీ హౌండియస్‌లో ఈ నెల రెండో తేదీన హంటా బయటపడింది. తీవ్ర అనారోగ్యానికి గురైన వ్యక్తికి పరీక్షలు జరపగా, తొలిసారి వైరస్ విషయం బయటపడింది. అప్పటికే ముగ్గురు రోజుల తేడాతో మరణించారు. వారిలో ఇద్దరు నౌకలోనే మరణించారు. దీంతో ఈ నౌకే హంటా వైరస్ కేంద్రమని గుర్తించారు. నౌకా సిబ్బందిలో ఇద్దరు భారతీయులు కూడా ఉండటం మరింత కలవరపెడుతోంది. డచ్‌కు చెందిన ఎంవీ హౌండియస్ గత నెల ఒకటో తేదీన అర్జెంటీనాలోని ఉషయా నుంచి స్పెయిన్‌లోని క్యానరీ దీవులకు బయల్దేరింది. ఈ నౌకలో 28 దేశాలకు చెందిన 150 మంది పర్యాటకులు ఉన్నారని తెలుస్తోంది. హంటా వైరస్‌కు గురైన ఎలుకల విసర్జితాలను తీసివేసే క్రమంలో అది వ్యాపించినట్టు డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. "వైరస్ సోకిన తర్వాత లక్షణాలు ఆరు వారాలలోపు బయటపడే అవకాశం ఉంది. అందువల్ల హంటా వైరస్ బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చు" అని వెల్లడించింది. మనిషి నుంచి మనిషికి వ్యాపించే అంటువ్యాధి లక్షణం ఈ వైరస్‌కు లేదని తెలిపింది. అర్జెంటీనా దక్షిణ ప్రాంతంలోని ఉషయా ఓడరేవులో డచ్ వ్యక్తి(70) తన భార్యతో కలిసి ఎంవీ హౌండియస్ నౌక ఎక్కారు. ఆ తర్వాత ఐదు రోజులకు ఆయన తీవ్ర జ్వరం, తలనొప్పి, స్వల్పంగా డయేరియాతో బాధపడుతూ, గత నెల ఏప్రిల్ ఆరోతేదీన మరణించాడు. భర్త చనిపోయిన 20 రోజులకు భార్య కూడా చనిపోయింది. మూడో హంటా మృతురాలిని జర్మనీ పర్యాటకురాలిగా గుర్తించారు. కాగా, హంటా వల్ల తక్షణంగా భారత్‌కు వచ్చిన ఆముప్పేమీ లేదని వైరాలజీ జాతీయ సంస్థ డైరెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. మరోవైపు కరోనా మహమ్మారితో హంటాను పోల్చలేమని డబ్ల్యూహెచ్‌వోకు చెందిన అంటువ్యాధుల నిపుణురాలు మరియా వాన్ కెర్కోవా అన్నారు.

# బెంగాల్ సీఎం.. సువేందు

**బీజేపీఎల్పీ నేతగా ఎన్నిక**
**ప్రకటించిన అమిత్ షా**
**గవర్నర్‌ను కలిసిన సువేందు**
**నేడు కోల్‌కతాలో ప్రమాణం**
**హాజరు కానున్న ప్రధాని మోదీ**



**కోల్‌కతా, మే 8:** పదిహేనేళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి పశ్చిమబెంగాల్‌లో విజయం సాధించినబీజేపీ.. సువేందు అధికారిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకటించింది. శుక్రవారం ఇక్కడ జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో.. పార్టీ సీనియర్ నేత, బెంగాల్‌లో బీజేపీ మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ సువేందు అధికారి పేరును ప్రతిపాదించారు. ఈ భేటీకి కేంద్రహోం మంత్రి అమిత్ షా పరిశీలకుడిగా, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ సహ పరిశీలకుడిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం.. పశ్చిమబెంగాల్ బీజేపీ శాసనసభా పక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికైనట్టు అమిత్ షా ప్రకటించారు. రాష్ట్రంలో కమ్యూనిస్టుల పాలనలో ఏర్పడిన భయానక వాతావరణం మమత హయాంలో మరింత దారుణంగా తయారైందని.. ఓటు వేయడమే అసాధ్యంగా మారిన పరిస్థితి ఏర్పడిందని.. అలాంటి పరిస్థితుల్లో బీజేపీని, తమ నాయకుడు నరేంద్ర మోదీని నమ్మి, ఇంతటి ఘనవిజయాన్ని అందించిన పశ్చిమ బెంగాల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. "ఇది శామాప్రసాద్ ముఖర్జీ ప్రభుత్వం" అని పేర్కొన్నారు. సువేందు అధికారి కూడా భావోద్వేగంతో.. 'ఇది భొయ్ అవుట్ భరోసా ఇన్ సమయం' అని వ్యాఖ్యానించారు. 'భయం పోయి నమ్మకం రావాలి' అనే సమయం వచ్చిందని దీని అర్థం. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో తొలిసారిగా పశ్చిమ బెంగాల్‌ను అధికారంలోకి తెచ్చిన అమిత్ షాను.. ఆధునిక భారతంలో అభినవ చాణక్యుడిగా అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ నాయకుడు నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని.. వాటిన్నింటినీ నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. కాగా.. శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన రెండు గంటల్లోపే .. సువేందు అధికారి బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరారు. ఇక.. కోల్‌కతాలోని చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం ఉదయం 11 గంటలకు సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తోపాటు, పలువురు కేంద్ర మంత్రులు దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అలాగే, ఉప ముఖ్యమంత్రులుగా అసన్‌సోల్ దక్షిణ్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన అగ్నిమిత్రపాల్, సిలిగురి నుంచి గెలిచిన శంకర్ ఘోష్‌లను నియమించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

# కేరళ సీఎం వేణుగోపాల్?

**కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అత్యధికులు ఆయన వైపే!**

**ఖర్గేకు పార్టీ పరిశీలకుల నివేదిక**
**11న ప్రమాణ స్వీకారం?**
**రేసులో సతీశన్, చెన్నితల**
**మిత్రపక్షాల ఓటు సతీశన్‌కే**



తిరువనంతపురం/న్యూఢిల్లీ, మే 8: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ కేరళ సీఎం రేసులో ముందంజలో ఉన్నారు. ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ ఆధ్వర్యంలో గురువారం తిరువనంతపురంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో.. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు వేణుగోపాల్‌కే ఓటేసినట్లు తెలిసింది. పరిశీలకులు శుక్రవారం ఢిల్లీలో ఖర్గేకు తమ నివేదిక సమర్పించారు. అంతా సాఫీగా జరిగితే 11న(సోమవారం) వేణుగోపాల్ సీఎంగా పదవీప్రమాణం చేస్తారని విశ్వసనీయ సమాచారం. అయితే ఇదంత తేలికగా కనిపించడం లేదు. ఎందుకంటే ఈ పదవి కోసం కాంగ్రెస్ సీనియర్ల మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. గత ఐదేళ్లు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పనిచేసిన వీడీ సతీశన్.. అంతకుముందు ఐదేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్న రమేశ్ చెన్నితల సీఎం కుర్చీ ఆశిస్తున్నారు. ఇటీవలి ఎన్నికల్లో 140 స్థానాల అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 102 స్థానాలు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ వాటా 63. ఐయూఎంఎల్(22), కేరళ కాంగ్రెస్(7) సహా మిగతా మిత్రపక్షాలు 39 సీట్లు గెలుచుకున్నాయి. సీఎల్పీ భేటీలో 63 మంది ఎమ్మెల్యేల్లో 43 మంది వేణుగోపాల్ వైపు మొగ్గుచూపినట్లు తెలిసింది. ఈలోపు సతీశన్ వర్గీయులు రోడ్లెక్కారు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు దిగారు. సోషల్ మీడియాలో ప్రత్యర్థులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. అటు వేణుగోపాల్ మద్దతుదారులు పీసీసీ కార్యాలయం ముందు సీఎం వేణుగోపాల్ అంటూ భారీ ఫ్లెక్సీలే పెట్టేశారు. ఇతరుల క్యాబినెట్‌లో తాను చేరనని.. ముఖ్యమంత్రి పదవి తప్ప మరేదీ తీసుకోనని.. సాధారణ ఎమ్మెల్యేగానే ఉంటానని సతీశన్ అధిష్ఠానానికి తేల్చిచెప్పినట్లు తెలిసింది. మిత్రపక్షాలు సైతం ఆయన్నే సీఎంగా కోరుకుంటున్నాయి.

సోనియాగాంధీకి సన్నిహితుడిగా పేరున్న చెన్నితల చాపకింద నీరులా తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. దీంతో సతీశన్, చెన్నితలకు అధిష్ఠానం నచ్చజెబుతున్నట్లు తెలిసింది. మిత్రపక్షాలతో కూడా సంప్రదింపులు జరిపాకే సీఎం అభ్యర్థిని ప్రకటించి 11న ప్రమాణ స్వీకారం చేయించాలని భావిస్తోంది. మధ్యేమార్గంగా మాజీ సీఎం కరుణాకరన్ కుమారుడు కె.కరుణాకరన్ సైతం తెరపైకి వచ్చే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. కాగా, సీఎల్పీ భేటీలో అందరు ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకోలేదని.. వేణుగోపాల్ అభ్యర్థిత్వానికి మద్దతు అడిగారని ప్రత్యర్థి వర్గాలు విమర్శిస్తున్నాయి. ఇదిలా ఉండగా, తిరువనంతపురంలోని కేరళ పీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నేత చెరియన్ ఫిలిప ఎమ్మెల్యే బిందు కృష్ణను కౌగిలించుకునే ప్రయత్నం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ఇండీ కూటమికి బీటలు

**కూటమి నుంచి వైదొలగిన డీఎంకే.. కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ పార్టీ**

**చెన్నై:** తమిళనాడు రాజకీయాలు క్రమంగా మారుతున్నాయి. విజయ్ టివికెకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో ఘాటుగా విమర్శించిన డిఎంకె ఇండి కూటమి నుంచి బయటకు వచ్చింది. ఈ మేరకు ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై చెప్పింది. ఇక కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసినట్లేనని వెల్లడించింది. తమకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి తాజాగా లేఖ రాశారు. కాంగ్రెస్ ఎంపీల పక్కన కూర్చోలేమని అందులో పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత టీవీకేకు కాంగ్రెస్ మద్దతు తెలపడంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నుంచి ఆ పార్టీ వైదొలగడాన్ని ఖండించారు. కూటమికి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిందని.. పాత రాజకీయ స్వభావాన్ని ఆ పార్టీ మార్చుకోలేదని ఆక్షేపించారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# ఈ నెల10 వరకు జిల్లాలోని ప్ర తి ఒక్కరు స్వీయగణన చేసుకోండి

**నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్**




**ప్రజా దీవెన, నల్లగొండ:** 2027 జ నగణన లో భాగంగా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10 వరకు మాత్రమే అవకాశం ఉందని, అం దువల్ల జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీ య గణన చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపుని చ్చారు. స్వీయ జనగణనపై ప్రజ ల్లో అవగాహన కల్పించే నిమిత్తం శుక్రవారం ముఖ్య ప్రణాళిక అధి కారి, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్జీ క ళాశాల నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన "జనగణన నడకను" జిల్లా కలెక్టర్, నల్గొండ మేయర్ బు ర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిలు ఎన్ జి కళాశాల వద్ద జెండా ఊపి ప్రారం భించారు. అనంతరం క్లాక్ టవర్ వద్ద ఏర్పా టు చేసిన సమావేశంలో జిల్లా కలె క్టర్ మాట్లాడుతూ 2027 జనగణం లో భాగంగా ముందుగా స్వీయ గ ణన ,గృహాల లెక్కింపు , జనగణన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నె ల 26 నుండి ప్రారంభమైన స్వీయ గణన ఈనెల 10తో ముగుస్తుం ద ని, జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణనలో పాల్గొనాలని వారి వివరా లన్నింటిని ఇవ్వాలని కోరారు. ఇం టిలో నుండే స్వీయ గణన చేసుకో వచ్చని,16 భాషల్లో గణన చేసుకు నేందుకు అవకాశం ఉందని, మొబై ల్ లోనే స్వీయ గణన చేసుకోవచ్చ ని,ఇదిచాలా సులభమని తెలిపా రు. ఈ నెల 11 నుండి ఎన్యుమరే టర్లు ఇల్లిల్లు తిరిగి హౌస్ లిస్టింగ్ చేస్తారని చెప్పారు. దేశ ప్రణాళిక, భవిష్యత్తు అభివృద్ధి అన్ని ప్రాంతా లను సమానంగా అభివృద్ధి చేసేం దుకు జనగణన ఉపయోగపడు తుందనిఅన్నారు. అనంతరం పట్టణంలోని పెద్ద బండ వద్ద స్వీయ గణన పై ఏర్పాటు చే సిన ప్రత్యేక శిబిరంలో కలెక్టర్ పా ల్గొని మాట్లాడుతూ స్వీయ గణన సందర్భంగా అద్దె ఇంట్లో ఉన్న అ క్కడి నుండే వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జన గణ మన సందర్భంగా సరైన సమాచా రం ఇవ్వాలని, ఇది భవిష్యత్తుకు ఎంతో ఉ పయోగపడుతుందని అ న్నారు .జనగణన జనాభా లెక్కలకు తప్ప ఇతర దేనికి ఉపయో గించడం జరగదని, అందువల్ల ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇంట్లో ఉన్న వారందరి వివరాలను తెలియజేయాలని, కుటుంబానికి ఒక ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని దీని ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు జనగణన జాప్యం లేకుండా త్వరత్వరగా చే సుకునేందుకు వీలవుతుంద న్నా రు .జిల్లాలో 20 లక్షల మంది జనా భా ఉండగా, 5,50,000 ఇండ్లు ఉ న్నాయని తెలిపారు. ఇప్పటివర కు 12000 కుటుంబాలు స్వీయగ ణన చేసుకోవడం జరిగిందని తక్కి న వారందరూ కూడా స్వీయ గణ నలో భాగస్వాములు కావాలని పునరుద్ఘాటించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీని వాస్ రెడ్డి మాట్లాడుతూ స్వీయ గ ణన పై ప్రజలలో అవగాహన క ల్పించే నిమిత్తం" జనగణన వాక్" నిర్వహించడం జరిగిందని, అభి వృద్ధికి జనాభా ఎంతో ముఖ్యమని అన్నారు.ప్రజలు ఇంటి నుండే సెల్ ఫోన్ లో స్వీయ గణన చేసుకోవ చ్చని, ఇందుకు కేవలం 10 పది నిమిషాలు కేటాయిస్తే సరిపోతుం దని ,స్వీయ గణనకు రెండు రోజు లు మాత్రమే అవకాశం ఉ న్నందున జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణ న చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశా రు. డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, సెన్సెస్ జాయింట్ డైరెక్టర్ రఘు, సిపిఓ శ్రీనివాస్ నాయక్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిష నర్ శరత్చంద్ర, జిల్లా క్రీడలు యువ జన సర్వీసుల అధికారి అక్బర్ అ లీ, తహసిల్దార్ పరశురాం, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, త దితరులు ఈ కార్యక్రమంలో పాల్గొ న్నారు.




# సూర్యాపేట కోర్టు సంచలన తీర్పు


**హత్య కేసులో 4గు రు నేరస్తులకు జీవిత ఖైదు శిక్ష**

**సూర్యాపేట, ప్రజాదీవెన:** మంత్రాల నెపం, భూవివాదం ఘటనలో 20 15 సంవత్సరంలో జరిగిన హత్య కేసులో పోలీస్ శాఖ అత్యంత పా రదర్శకమైన దర్యాప్తు చేసి బల మై న సాక్షాలు ఆధారాలతో నేర అభి యోగ పత్రాలు కోర్టులో దాఖలు చే సి, సకాలంలో బాధితులను, సా క్షులను, నిందితులను కోర్టుకు హా జరుపచగా వాదనలు హుజూర్ నగర్ రెండవ అదనపు జిల్లా మరి యు సెషన్స్ జడ్జ కోర్టు కేసులో న లుగురు నేరస్తులు నేరానికి పాల్ప డ్డారని గుర్తించి జీవిత ఖైదు జైలు శిక్ష విధించడం జరిగిందని నర సిం హ వెల్లడించారు. కేసు వివరాల లోకి వెళితే గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో యెడిపాల వీరారెడ్డి, యెడిపాల లింగారెడ్డి పా లివారి రెండు కుటుంబాల మధ్య భూ వివాదం ఉన్నది. ఈ వివాదం లో ఇరు కుటుంబాలు తరచూ గొడ వపడేవారు ఇందులో లింగారెడ్డి కు మారుడు అనారోగ్యానికి గురికావ డానికి కారణం వీరారెడ్డి మంత్రాలు చేస్తున్నాడని నమ్మకంతో హత్య చే శారు. 2015 సంవత్సరం జూలై నె ల 19వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో వీరారెడ్డి పొలంలో మోటర్ బందు చేసి వస్తానని కు టుంబ సభ్యులకు చెప్పి వెళ్లి తిరిగి రానందున వీరారెడ్డి గురించి వెతికి న అతని ఆచూకీ లభించనందున జులై 20వ తేదీన వీరారెడ్డి కుమా రుడు వీర భాస్కర్ రెడ్డి గరిడేపల్లి పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చే శారు.

ఫిర్యాదు పై మిస్సింగ్ కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తుండగా 21వ తేదీ సాయంత్రం వీరారెడ్డి మృతదే హం రిజర్వాయర్ లో గన్ని బ్యాగు లో లభించినది. మిస్సింగ్ కేసును హత్య కేసుగా తిరగరాసి అప్పటి హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ త దుపరి విచారణ చేపట్టి యెడిపాల లింగారెడ్డి, యెడిపాల సత్యనారా యణ రెడ్డి, యెడిపాల ఉపేందర్ రె డ్డి, యెడిపాల సైదిరెడ్డి నలుగురు నిందితులను అరెస్టు చేసి నేరానికి పాల్పడినారని బలమైన ఆధారా లు, సాక్షాధారాలతో నేరాభియోగ పత్రాలను కోర్టుకు అందజేయడం జరిగింది. కేసు దర్యాప్తులో భాగం గా నిందితులు హత్య కోసం ఉప యోగించిన రెండు మోటార్ సైకి ళ్ళు, రెండు ఐరన్ రాడ్స్, హెక్స్-ల్ బ్లేడ్, రాయి, పారను స్వాధీనప ర్చుకున్నారు. ఈ కేసులో విచారణ వేగవంతం చేసి కోర్టుతో సమన్వ యంగా పనిచేసి నేరస్థులకు శిక్షలు పడేలా కృషి చేయాలని సంబంధి త సిబ్బందిని ఆదేశించడం జరిగిం ది.

16 మంది సాక్షులను విచారించి, కేసు ఆధారాలను పరిశీలించిన హుజుర్ నగర్ కోర్టు న్యాయమూర్తి నిందితులు నలుగురు నేరానికి పాల్పడ్డారని నిర్ధారించి జీవిత ఖై దు శిక్ష, ఒక్కొక్కరికి 1500 రూపా యల చొప్పున జరిమానా విధించ డం జరిగినది. కోదాడ డిఎస్పీ శ్రీని వాస్ రెడ్డి పర్యవేక్షణలో, హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు పర్యవేక్షణలో సాక్షులను గౌ రవ కోర్ట్ నందు సక్రమంగా హాజరు పరచడం వల్ల ఈ రోజు రెండో అద నపు జిల్లా ఢ సెసన్స్ జడ్జ హుజూ ర్నగర్ ఇట్టి కేసులో నలుగురి నిం దితులకు జీవిత ఖైదు మరియు ఒక్కొక్కరికి 1500మొ-ఁత్తం 6000 /జరిమానా విదించినారు. ఫైన్ కట్ట ని సమక్షంలో ఒక్కొక్కరికి 45 రో జుల సాదారణ జైలు శిక్ష విధించి నారు. బాధితుల తరపున కేసును పబ్లిక్ ప్రసుక్యూటర్ బొబ్బ కోటిరెడ్డి తరుపున బలమైన వాదనలు విని పించినారు. గరిడేపల్లి ఎస్ఐ నరేష్, కోర్టు కాని స్టేబుల్ లు సైదులు, రాము కోర్టు అధికారులతో సమన్వయంగా పని చేశారన్నారు. చట్టాలు బలోపేతం చేయబడ్డాయి కేసుల దర్యాప్తు, కే సుల చేతనలో పోలీసులు నైపు ణ్యంతో పనిచేస్తున్నారు నేరాలకు తప్పులకు పాల్ప డితే ఏనాటికైనా చట్టపరంగా జైలు శిక్షలు తప్పవు అని ఎస్పీ హెచ్చరించారు.

# మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**శాలిగౌరారం :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత మహిళా సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం శాలిగౌరారం లోని రైతు వేదికలో 90 మందికి కల్యాణ లక్ష్మి, షాదిముభారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం శాలిగౌరారం స్టేట్ బ్యాంక్ ఎదురుగా చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేశీంద్రాన్ని ఎమ్మెల్యే సామెల్ ప్రారభించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా మహిళలు తమ పిల్లలను క్రమశిక్షణ తో పెంచుకోవాలన్నారు.చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయం లో వారి దాహర్తిని తీర్చడానికి చల్లటి మజ్జిగ పంపిణి చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ నరిగె నర్సింహా, సింగల్ విండో ఛైర్మెన్ తాళ్లూరి మురళి, వైస్ ఛైర్మెన్ చామల మహేందర్ రెడ్డి, తహసీల్దార్ మాధవరావు,డీటీ బిట్ల వరప్రసాద్, సర్పంచులు శేఖర్ బాబు, చాడ కవిత, వంగూరి కవిత, నరిగె యాదయ్య, నాయకులు చాడ సురేష్ రెడ్డి,భూపతి అంజయ్య, బొల్లికొండ గణేష్, పెరుమాండ్ల నరేష్, పుల్లూరి దేవేందర్, ననుబోతు అంజయ్య,యుగేందర్ రెడ్డి,పడాల రమేష్, మంగడుడ్ల శ్రీనివాస్ ఆర్ ఐ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అడ్లూర్ సర్పంచ్ కట్ట లక్ష్మి - వెంకటరెడ్డి ఎమ్మెల్యే మందుల సామేల్ కు లారీల సమస్య లేకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని వినతిపత్రం అందజేశారు.

# దుద్దుకూరి ఎల్లయ్య మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు: బత్తినేని



**ప్రజా దీవెన, కోదాడ :** మున్సిపల్ పరిధిలోని తమ్మర బండ పాలెం స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన దుద్దుకూరి ఎల్లయ్య మరణం తమ్మరు కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖకు తీరని లోటని కోదాడ మండల సిపిఐ కార్యదర్శి బత్తినేని హనుమంతరావు అన్నారు ఎల్లయ్య గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సందర్భంగా శుక్రవారం మృతిని నివాస గృహానికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు వెళ్లి పార్థివ దేహం పై ఎర్రజెండా కప్పి పూలమాలలతో ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఎల్లయ్య ఎనలేని కృషి చేశాడని గుర్తు చేశారు ఎల్లయ్య కుటుంబం అంతా కమ్యూనిస్టు పార్టీ ఆశయాలకు కట్టుబడి ఉందని తెలిపారు ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి మాతంగి ప్రసాదు అల్వాల్ పురం గ్రామ సర్పంచ్ పోతురాజు సత్యనారాయణ సిపిఐ వార్డు కౌన్సిలర్ రాయపూడి కాటంరాజు కొండా కోటేశ్వరరావు నిడిగొండ రామకృష్ణ బత్తినేని శ్రీనివాసరావు ఎస్కే బాబు మేస్త్రి నిలిగొండ శ్రీనివాసరావు అల్వాల గురవయ్య బొమ్మ కంటి రాంబాబు అల్వాల శ్రీను నిడిగొండ రాంబాబు పస్తం లింగయ్య,ప్రస్తం ఎల్లయ్య శీను, సద్దాం నిడికొండ రాంబాబు, మధ్యాహ్నపు శ్రీను పాస్తు సుందరయ్య, తదితరులు నివాళులర్పించారు

# స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకువాలి : ఎమ్మెల్యే సామేల్



**శాలిగౌరారం :** గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. శుక్రవారం శాలిగౌరారం లోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా చైత్ర ఫౌండేషన్ ఛైర్మెన్ యంగలి రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చలి వేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం,పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయం లో నిత్యం మజ్జిగ ప్యాకెట్స్ పంపిణి చేయడం అభినందనీయమన్నారు. చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యం అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందుకుంటున్నారన్నారు.ప్రజా సేవకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమం లో శాలిగౌరారం, అంబారిపేట సర్పంచులు గుజిలాల్ శేఖర్ బాబు, సుంచు నర్సింహా,సింగల్ విండో వైస్ ఛైర్మెన్ చామల మహేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మెన్ బుడిగె శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపినాథ్,మండల అధ్యక్షులు బొల్లికొండ గణేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, నాయకులు కాంచాని నాగరాజు,పెరుమాండ్ల నరేష్,శానాల యుగేందర్ రెడ్డి, పుల్లూరి దేవేందర్, మంగడుడ్ల శ్రీనివాస్,సుల్తాన్ యల్లయ్య,రామచంద్రు,వంగూరి వెంకన్న,కడారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ:



**సూర్యాపేట, ప్రజాదీవెన :** సూర్యాపేట జిల్లా నూతన రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.హరి సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అదనపు కలెక్టర్ కు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ కు జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# లారీ యజమానులకు డబ్బులు ఇవ్వవద్దు..

**ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ కీలక ఆదేశాలు**



**శాలిగౌరారం :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి యారాల అశోక్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో శాలిగౌరారం మండలంలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు, లారీల కొరత సమస్యపై చర్చించారు. సమావేశంలో అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అదనపు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. సీరియల్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి, రైతులు ధాన్యం నాణ్యతలో ఫీూు రూల్స్ పాటించాలి, రైతులు లారీ డ్రైవర్లకు డబ్బులు ఇవ్వకూడదు అని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ మాధవరావు, ఏ.పి.ఎం శంకరయ్య, సింగల్ విండో సిఈ ఓ నిమ్మల ఆంజనేయులు, డీటీ వరప్రసాద్,లారీ కాంట్రాక్టర్ యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

**- అడిషనల్ కలెక్టర్**

**సూర్యాపేట, ప్రజాదీవెన :** జిల్లాలో 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి.హరి సింగ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలపై విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 13 నుంచి మే 21 వరకు థియరీ పరీక్షలు జరుగుతాయని, మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9:00 నుండి 12:00 వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు, వెలుతురు, ఫస్ట్ ఎయిడ్ ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సిసి కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసేలా వాతావరణం కల్పించాలని, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఐఈఓ బి సులోచన రాణి, బాను నాయక్, ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రేపటిలోగా స్వీయగణన పూర్తి చేయించాలి

**నల్లగొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్**




**ప్రజా దీవెన, నల్లగొండ:** ఈనెల 10లోగా జిల్లాలో అన్ని శాఖల అధికారులు వారి కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందితో స్వీయ గణన చేయించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశిం చా రు. 2027 జనగణన లో భాగంగా స్వీయ గణన విషయమై శుక్రవారం సాయంత్రం అయన కలెక్టర్ కార్యాలయం నుండి జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో లక్ష మందికి పైగా ఉద్యోగులు ఉన్నారని ,ముఖ్యంగా విద్య, వైద్య ఆరోగ్య ,వ్యవసాయ

ఐసిడిఎస్ ,డిఆర్డిఏ, మెప్మా తదితర శాఖలలో ఎక్కువ మంది ఉద్యోగులతో పాటు, స్వయం సహాయక మహిళా సంఘాలు, పట్టణస్థాయి సంఘాలు ,గ్రామ సమాఖ్యలు, పనిచేస్తున్నారని వీరందరి చేత ఆదివారంలోగా స్వీయ గణన చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో కేవలం 13 వేల మంది మాత్రమే స్వీయ ఘనంగా చేసుకున్నారని, లక్షమంది వరకు స్వీయగణన చేసుకునేందుకు అవకాశం ఉందని ,ఈ విషయంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రతి ఏఈఓ తన పరిధిలో కనీసం 20 మందితో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేయించాలన్నారు. అలాగే ఫర్టిలైజర్, సీడ్ డీలర్లు అందరితో ఎన్యుమరషన్ చేయించాలని, విద్యాశాఖలోని ప్రతి టీచర్ ఎన్యుమరేషన్ చేసుకునే విధంగా ఎంఈఓ లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేజీబీవీ ల ప్రత్యేక అధికారులు, మోడల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్లు, వారితోపాటు, వారి బంధువులు కుటుంబ సభ్యులందరికీ చేయించాలని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులకు ఈ నెల 11 నుండి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ ప్రారంభమవుతున్నందున ముందుగా సెల్ఫ్ ఎన్యుమేరేషన్ పూర్తి చేయాలని చెప్పారు. హెచ్ఎల్బిలో మార్పు, బౌండరీ లో విషయమై ఏవైనా మార్పు చేర్పులు ఉంటే తక్షణమే చార్జ్ ఆఫీసర్ కు తెలియజేయాలని చెప్పారు. జిల్లాలోని అందరు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు జనగణనకు సంబంధించిన కిట్లు చేరింది లేనిది మరోసారి తనిఖీ చేయాలని, సిపిఓ శ్రీనివాస్ నాయక్ ను ఆదేశించారు. ముందు 3 రోజులు ప్రతి ఇంటికి నంబర్ కేటాయించిన తర్వాత జనగణన ప్రారంభించారని చెప్పారు.

డి ఆర్ డి ఓ,పిడి మెప్మా, ఐసిడిఎస్, శాఖల అధికారులు సెల్ఫ్ ఎన్యుమరేషన్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఆర్పిలు ఒక్కొక్కరు కనీసం 500 మందిని ఎన్యుమరేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని, ఆదేశాలు జారీ చేశారు.

అంతకుముందు రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోలికెరీ ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించా రు. ఈ సందర్భంగా జిల్లాలో స్వీయ జనగణన పై తీసుకున్న చర్య లను జిల్లా కలెక్టర్ సెన్సెస్ డైరెక్టర్ కు వివరించారు. జిల్లాలో గ్రామపం చాయతీ కార్యదర్శులతో పాటు, మున్సిపాలిటీలలో వార్డు అధికారులకు అలాగే శానిటేషన్ వాహ నాల ద్వారా ప్రచారం నిర్వహిస్తు న్నామని, శుక్రవారం సెన్సెస్ వాక్ నిర్వహించడం జరిగిందని తెలిపా రు.సిపిఓ శ్రీనివాస్ నా యక్, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రె డ్డి, జిల్లా వ్య వసాయ అధికారి శ్రవణ్ కుమార్, డీఈఓ బిక్షపతి, మెప్మా పీడి శ్రీని వాస్, డిసిఓ పత్య నాయక్, డిపి ఓ శంకర్ నా యక్, తదితరులు ఈ వీడియో కా న్ఫరెన్స్ కు హాజ రయ్యారు.

# రబీ దాన్యం సేకరించాలి

**కలెక్టర్**



**సూర్యాపేట, ప్రజాదీవెన :** ప్రస్తుత రబీ సీజన్ 2025-26 కు సంబంధించి 1.85 లక్షల మెట్రిక్ టన్నులధాన్యంను రైతుల నుండి సేకరించి, ఆ ధాన్యంను రైస్ మిల్లులకు పంపించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.. జిల్లా కలెక్టర్ మరియు అదనపు కలెక్టర్, జిల్లా రైస్ మిల్లర్ల తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.55 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తాదని అంచనా వేస్తున్నాము, రైతుల నుండి సేకరించిన ధాన్యం మిల్లు వద్దకు వచ్చిన వెంటనే అన్ లోడింగ్ చేయాలని సూచించారు. రైస్ మిల్లర్ల సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి సమస్య రాకుండా చూడాలన్నారు. ధాన్యం మిల్లింగ్ పూర్తి చేసిన తదుపరి సిఎంఆర్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ఎఫ్ సిఐకి బియ్యం అందజేయాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత, కొనుగోలు చేసిన ధాన్యం విలువైన రు. 206 కోట్లు రైతు ఖాతాలలో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, రైతులు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి అపోహలు పడకూడదని, ఎవరైనా తప్పుడు సమాచారం ఇస్తే నమ్మవద్దని సూచించారు. సివిల్ సప్లై అధికారులు మరియు రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హరి సింగ్, డి.ఎస్.ఓ మోహనబాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా చర్యలు

**నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్ర శే ఖర్ ఆదేశం**

**ప్రజా దీవెన, నల్లగొండ:** రానున్న జులై 15 వరకు జిల్లాలో ఎలాంటి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చం ద్రశేఖర్ ఆర్డబ్ల్యూఎస్ ,మిషన్ భ గీ రథ ఇంజనీరింగ్ అధికారులను ఆ దేశించారు. శుక్రవారం అయన ఉ దయాదిత్య భవన్ లో జిల్లాలోని తాగునీటి పరిస్థితిపై సమీక్ష తాగు నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యను అక్కడికక్కడే పరిష్కరించాలని పరిష్కారం కాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తాగునీటి విషయంలో పూర్తి భరోసాను ప్రజలకు కల్పించాల్సిన బాధ్యత మిషన్ భగీరథ అధికారులపై ఉందని ఆయన అన్నారు .ఎక్కడ తాగునీరు వృధా కాకూడదని, ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునేలా చూడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా బల్క్ సరఫరా లో సమస్యలు, అలాగే రిపేరీలు ఉన్నట్లయితే వెంటనే సమస్యలు పరిష్కరించాలని, తాగునీటిని పూర్తిస్థాయిలో పరీక్ష నిర్వహించిన తర్వాతే సరఫరా చేయాలని, ఇందుకు గాను ప్రతి మున్సిపాలిటీకి తాగు నీటి టెస్టింగ్ కిట్లను ఇవ్వడం జరిగిందని చెప్పారు . ఏ ఈ లు గ్రామాలలో సర్పంచులతో అనుసంధానంలో ఉండి ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ఎక్కడైనా చిన్న చిన్న లీకేజీలు లేదా మరమ్మతులు ఏర్పడితే వెంటనే అరికట్టాలని, పెద్ద సమస్యలు వస్తే తమ దృష్టికి తేవాలన్నారు. తాగునీటి పై పత్రికలలో వచ్చే వ్యతిరేక వార్తలకు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవడంతో పాటు, వివరణలు ఇవ్వాలని



ఆదేశించా రు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా పత్రికల్లో వచ్చిన వార్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వా రా ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షించి అందు గల కారణాలను తెలుసుకు న్నా రు. మిషన్ భగీరథ ఎస్ ఈ నాగే శ్వరరావు మాట్లాడుతూ వేస విలో తాగునీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు చూడా లని, ఎక్కడైనా సమస్యలు వస్తే వెం టనే తమ దృష్టికి తీసుకు రావా ల ని గ్రిడ్ వాటర్ రాకపోతే అద్దె బోర్ల ద్వారా లేదా ఇతర మార్గాల ద్వా రా తాగునీరు అందించాలని చెప్పారు. ప్రజారోగ్య ఎస్ఈ వెం క టే శ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ శాం త కుమారి, జిల్లా పంచాయతీ అధి కారి శంకర్ నాయక్, మిషన్ భగీర త ఈఈలు, డిఈ లు, ఏఈ లు తదితరులు ఈ సమావేశానికి హాజ రయ్యారు.

# సిగరెట్ నిర్లక్ష్యం వల్ల ఐకేపీ సెంటర్ పక్కన మంటలు



**శాలిగౌరారం :** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామ ఐకేపీ కొనుగోలు కేంద్రం పక్కన ఉన్న పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి పడేయడంతో ఎండిన కళ్ళంలో మంటలు అంటుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని చిత్తలూరు గ్రామ శివారులో ఐకేపీ కేంద్రం సమీపంలో గాలి వీచడంతో మంటలు వేగంగా వ్యాపించి కేంద్రంలోని ధాన్యం రాశికి అంటుకునే ప్రమాదం ఏర్పడింది.వెంటనే నీళ్లు చళ్ళుతు అక్కడ ఉన్న రైతులు, ఐకేపీ సిబ్బంది, గ్రామస్తులు అప్రమత్తమై నకిరేకల్ లోని ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని నీటిని చిమ్మి మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో చర్యలు తీసుకోవడంతో ఐకేపీ సెంటర్, ధాన్యం నిల్వలకు పెను ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు పీర్నాయకం కరుణ, ఎర్ర రాజు, పీర్నాయకం వెంకన్న, గ్రామ సర్పంచ్ గిరిగాని వెంకన్న, ఉప సర్పంచ్ ఎనమళ్ల శంకర్, మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, మారుపాక శ్రీధర్, శ్రీరంగం, తరాల బిక్షం తదితర గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా వేముల ఆంజనేయులు నియామకం

**శాలిగౌరారం :** శాలిగౌరారం మండలం పెర్కొండారం గ్రామానికి చెందిన వేముల ఆంజనేయులు బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఈ నెల 10వ తారీకు న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను జయప్రదం చేయండి



ప్రజా దీవెన, కోదాడు: మే 10 వ తారీఖున హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్లో జరిగే నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు పిలుపునిచ్చారు శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ 10వ తారీకు న జరుగు నరేంద్ర మోదీ బహిరంగ సభకు కోదాడ ప్రాంతం నుండి పెద్దఎత్తున జనశీ తరలి రావాలి అని కార్య కర్తలకు, పిలుపు నిచ్చారు అలాగే రాష్ట్ర నాయకురాలు నూనె సులోచన మాట్లాడుతూ మహిళలు పెద్ద సంఖ్యలో ఈ సమావేశం నకు తరలి రావాలని వారు కోరారు ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బోలిశెట్టి కృష్ణయ్య, వెలివోల చిట్టి బాబు కోదాడ మండల పార్టీ అధ్యక్షులు గాధరి పుల్లారావు, అనంతగిరి మండల అధ్యక్షులు సతీష్ ఓరుగంటి పురుషోత్తం, చిలుకూరు శ్రీను, జల్లా జనార్షన్, కొండయ్య, రమేష్, భూమా శ్రీను తదితరులు పాల్గొన్నారు

# నల్లగొండ లో మైనర్ బైక్ దొంగల అరెస్ట్



**ప్రజా దీవెన, నల్లగొండ క్రైమ్:** చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోకుం డా యువత చదువు, క్రమశిక్షణపై దృష్టి పెట్టాలని టూ టౌన్ ఎస్ఐ వై. సైదులు సూచించారు. శుక్రవారం పోలీస్ స్టేష న్లో ఏర్పాటు చేసిన మీ డియా సమావేశంలో ఆయన మా ట్లాడుతూ టూ టౌన్ పరిధిలో రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చే సుకుని ముగ్గురు మైనర్ యువకు లు వరుస దొంగతనాలకు పాల్పడు తున్నారని తెలిపారు. సీఐ పర్యవే క్షణలో ముగ్గురు మైనర్ల గ్యాంగ్ ను అరెస్ట్ చేసి 4ద్విచక్ర వాహనాలను రికవరీ చేశామన్నారు. మేము లోక ల్,ఎవరూ గుర్తుపట్టరు అనే ధైర్యం తో జల్సాలకు అలవాటు పడి వా హనాలను అపహరించారు. దొంగి లించిన వాహనాల రూపురేఖలు, నంబర్ ప్లేట్లు మార్చి తిరుగుతు న్నట్లు విచారణలో వెల్లడైంది. ఫి ర్యాదుల మేరకు ప్రత్యేక బృందం తో గ్యాంగ్ ను అదుపులోకి తీసు కున్నామని, 3హోండా యాక్టివా స్కూటీలు,1పల్సర్ ఎన్ఎస్ 200 బైక్ సహా మొత్తం 4 వాహనా లను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ. 3. 5లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు ఛేద నలో కీలకంగా పనిచేసిన కానిస్టే బుళ్లు ఎండీ షకీల్, ఎల్. బాలకోటి ని ఉన్నతాధికారులు అభినందించారు.

# సీతారామాంజనేయ స్వామి దేవాలయ ముఖమండపం పునర్నిర్మాణ పనులు ప్రారంభం



**ప్రజా దీవెన, కోదాడ :** మండల పరిధిలోని గుడిబండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయం ముఖ మండపం శిథిలావస్థకు చేరినందున పునర్నిర్మాణము పనులను శుక్రవారం ప్రారంభించినారు ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు ఎరగాని లక్ష్మయ్య, కోదాడ ౹ాఖిఎం చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, ఓరుగంటి రామకృష్ణారెడ్డి, చింత మాధవ్ రెడ్డి, తుమాటి వరప్రసాదరెడ్డి, చింతా వెంకట్ రెడ్డి, ఆత్కూరి రాంబాబు చింత శ్రీకాంత్ రెడ్డి, కుక్కడపు సైదులు, శ్రీనివాసుల రామకృష్ణారెడ్డి, పెరుమళ్ళ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# సూర్యాపేట రూరల్ తండాలో అమాయక ప్రజలే లక్ష్యంగా భారీ దోపిడీ!

**సూర్యాపేట:** భక్తి ముసుగులో మోసాలకు తెరలేపిన ఓ దొంగ బాబా.!!! సూర్యాపేట రూరల్ మండలంలోని ఒక తండా వేదికగా, అమాయక ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని లక్షల రూపాయలు గడిస్తున్న వైనం ఇప్పుడు జిల్లాలో సంచలనంగా మారింది.

## సోమ, శుక్రవారాల్లో 'ప్రత్యేక' అవతారం!

ప్రతి సోమవారం మరియు శుక్రవారం వచ్చిందంటే చాలు, సదరు వ్యక్తి 'బాబా' అవతారం ఎత్తుతాడు. అనారోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, సంతాన లేమి వంటి సమస్యలతో వచ్చే పేద ప్రజలను తన మాయ మాటలతో నమ్మిస్తాడు. దేవుడు పూనకంతో ఊగిపోతున్నట్లు నటిస్తూ భక్తులను బురిడీ కొట్టిస్తున్నాడు.

నిమ్మకాయల నుంచి యంత్రాల వరకు.. అన్నీ వ్యాపారమే!

ఈ బాబా వద్ద ప్రతి దానికి ఒక రేటు ఫిక్స్ అయ్యి ఉండటం గమనార్హం. నిమ్మకాయలు ఉ కొబ్బరికాయలు పూజల పేరుతో వీటిపై బారి ఎత్తున డబ్బులు వసూలు. యంత్రాలు ఉ తాయెత్తులు సమస్యలు పరిష్కారం అవుతాయంటూ వేల రూపాయలకు వీటిని అంటగడుతున్నాడు. ఇప్పటికే వందలాది మంది బాధితుల నుండి మాయమాటలు చెప్పి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఈ దొంగ బాబా ఆగడాలపై ఫిర్యాదులు రావడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, కేవలం కేసు పెట్టి చేతులు దులుపుకోవడంతో బాబా తన ఆగడాలను యధావిధిగా కొనసాగిస్తున్నాడు. "మోసపోయామని తెలిసి నిలదీస్తే.. మంత్రాల నెపంతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి." అక్షరాస్యత పెరుగుతున్నా, ఇలాంటి మూఢనమ్మకాల పేరుతో ప్రజలను దోచుకోవడం సిగ్గుచేటు అయితే "ఇతగాడి ఇంటి పక్కనే బడి" బయ భ్రాంతులకు గురి అయిన విద్యార్థులు బడికి రాకాకపోవడంతో మూత పడిన ప్రభుత్వ పాఠశాల. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఈ దొంగ బాబా ఆగడాలను అరికట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు మరియు బాధితులు కోరుతున్నారు.

# ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగ వంతం చేయాలి



ప్రజా దీవెన, వేములపల్లి: రైస్ మి ల్లుల వద్ద ధాన్యం అన్లోడింగ్ ప్రక్రి యను వేగవంతం చేయాలని రెవె న్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్ర వారం అయన నల్గొండ జిల్లా వే ములపల్లి మండలం శెట్టిపాలెంలో ఉన్న వసంత రైస్ ఇండస్ట్రీస్, పద్మ శ్రీ రైస్ ఇండ స్ట్రీస్ ను ఆకస్మిక తని ఖీ చేసి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ ను పరి శీలించారు . అన్లోడింగ్ తో పాటు, బి రిజిస్టర్, ట్రక్ చీట్స్, మి ల్లర్ అక్నాలెడ్జ్మెంట్ లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ దాన్యం అన్లో డింగ్లో జాప్యం లేకుండా రైస్ మిల్ల ర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు గాను సరైనంతమంది హమా లీలు ,లారీలను సిద్ధంగా ఉంచు కోవాలని, ఏవైనా సమస్య లు ఉంటే తమ దృష్టికి తీసుకురా వాలని, ఎట్టి పరిస్థితులలో అన్లో డింగ్లో జాప్యం చేయవద్దని చెప్పా రు. మిర్యాలగూడ ఆర్డిఓ రమణా రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, తదితరులు అడిషనల్ కలెక్టర్ వెంట ఉన్నారు.

# కోల్‌కతాకు వరుసగా నాలుగో విజయం

## 47 బంతుల్లో మెరుపు శతకం

## 8 వికెట్లతో ఢిల్లీ చిత్తు



న్యూఢిల్లీ: తొలి ఆరు మ్యాచ్‌ల్లో గెలుపనేదే లేకుండా సాగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆలస్యంగానైనా అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థి బ్యాటర్లు పరుగుల కోసం కష్టపడిన చోట ఓపెనర్ ఫిన్ ఆలెన్ (47 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్సర్లతో 100 నాటౌట్) అజేయ శతకంతో హోరెత్తించాడు. ఫలితంగా శుక్రవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో నైట్‌రైడర్స్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. కోల్‌కతాకిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. దీంతో పట్టికలో 9 పాయింట్లతో ఏడో స్థానానికి చేరింది. ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 142 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 50), అశుతోష్ శర్మ (28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 39), కేఎల్ రాహుల్ (14 బంతుల్లో 4 ఫోర్లతో 23) మాత్రమే రాణించారు. కార్తీక్ త్యాగి, అనుకుల్ రాయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో కోల్‌కతా 14.2 ఓవర్లలో 2 వికెట్లకు 147 పరుగులు చేసి గెలిచింది. కామెరూన్ గ్రీన్ (27 బంతుల్లో 2 సిక్సర్లతో 33 నాటౌట్) ఆకట్టుకున్నాడు. సెంచరీ హీరో ఫిన్ ఆలెన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

### శతక భాగస్వామ్యం:

స్వల్ప ఛేదనను కోల్‌కతా సునాయాసంగా ముగించింది. ఓపెనర్ ఫిన్ ఆలెన్ ఢిల్లీ బౌలర్లను ఆడేసుకున్నాడు. ఢిల్లీ బ్యాటర్లు కష్టపడిన చోట అతను ఏకంగా 10 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అతడికి గ్రీన్ సహకరించడంతో కోల్‌కతా 34 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది. ఆరంభంలో మరో ఓపెనర్ రహానె (13) కూడా వేగంగా ఆడినా, అతను మూడో ఓవర్‌లోనే రనౌట్‌గా వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్‌లో రఘువంశీ (1)ని అక్షర్ పటేల్ బౌల్డ్ చేశాడు. స్వీప్ షాట్ ఆడే క్రమంలో బంతి అతడి గ్లౌవ్స్‌ను తాకి పైకి లేచి కింద పడే క్రమంలో బెయిల్స్‌ను తాకింది. ఇక, పవర్‌ప్లే తర్వాత ఆలెన్ విధ్వంసం సాగింది. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు రాబట్టాడు. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తయ్యాక అతడు మరింత చెలరేగాడు. విప్రజ్ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లు బాది 21 రన్స్ అందించాడు. ఇక విజయానికి రెండు పరుగులు.. శతకానికి ఆరు పరుగులు కావాల్సిన తరుణంలో పేసర్ ముకేశ్ షార్ట్ పిచ్ బంతిని ఆలెన్ సిక్సర్‌గా మలిచాడు. దీంతో ఐపీఎల్‌లో తన తొలి శతకం నమోదు చేయడంతో పాటు జట్టును కూడా గెలిపించి సంబరాలు చేసుకున్నాడు. మూడో వికెట్‌కు ఆలెన్-గ్రీన్ అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు.

### చెమటోడ్చిన ఢిల్లీ:

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ పరుగుల కోసం తీవ్రంగా శ్రమించింది. ఈ క్రమంలో వికెట్లను కూడా చేజార్చుకుంది. ఓపెనర్ నిస్సాంకతో పాటు చివర్లో అశుతోష్ మినహా ఇతర బ్యాటర్లు ఏమాత్రం ప్రభావం చూపలేదు. కోల్‌కతా పేసర్లు, స్పిన్నర్లు అత్యంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ 150 పరుగులైనా చేయలేకపోయింది. వాస్తవానికి నిస్సాంక మరో ఓపెనర్ రాహుల్ ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించారు. చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ చకచకా పరుగులు రాబట్టారు. పేసర్ కార్తీక్ ఐదో ఓవర్‌లో రాహుల్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అక్కడి నుంచి ఢిల్లీ అనూహ్యంగా తడబడింది. నితీశ్ రాణా (8), సమీర్ రిజ్వీ (3), స్టబ్స్ (2)లను ఏమాత్రం కుదురుకోనీయకుండా ప్రత్యర్థి బౌలర్లు పెవిలియన్‌కు చేర్చడంతో జట్టు తీవ్ర ఒత్తిడిలో పడింది. దీనికితోడు 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన నిస్సాంక స్టంపౌట్ కావడం మరింత దెబ్బతీసింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్ల ధాటికి కెప్టెన్ అక్షర్ (11), అశుతోష్ ఆచితూచి ఆడాల్సి వచ్చింది. ఓ దశలో వీరి ఆట టెస్టును తలపించింది. అయితే 17వ ఓవర్‌లో అశుతోష్ 6,4,4తో 16 రన్స్ అందించాడు. 19వ ఓవర్‌లో అక్షర్ వెనుదిరగడంతో ఆరో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అశుతోష్ మాత్రం అదే ఓవర్‌లో 6,3తో జోరును చూపాడు. కానీ చివరి ఓవర్‌లో పేసర్ కార్తీక్ మూడు పరుగులే ఇచ్చి అశుతోష్ వికెట్ తీయగా స్టార్క్ (0) రనౌటయ్యాడు.

### స్కోరుబోర్డు

ఢిల్లీ: నిస్సాంక (స్టంప్డ్) రఘువంశీ (బి) అనుకుల్ 50, రాహుల్ (సి) గ్రీన్ (బి) కార్తీక్ త్యాగి 23, నితీశ్ రాణా (సి) నరైన్ (బి) గ్రీన్ 8, రిజ్వీ (సి) పొవెల్ (బి) నరైన్ 3, స్టబ్స్ (బి) అనుకుల్ 2, అక్షర్ (సి) అనుకుల్ (బి) వైభవ్ అరోరా 11, అశుతోష్ (సి) రహానె (బి) కార్తీక్ త్యాగి 39, విప్రజ్ నిగమ్ (నాటౌట్) 3, స్టార్క్ (రనౌట్) 0, ఎన్‌గిడి (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 142/8; వికెట్ల పతనం: 1-49, 2-74, 3-80, 4-85, 5-89, 6-128, 7-140, 8-140; బౌలింగ్: అనుకుల్ రాయ్ 4-0-31-2, వైభవ్ అరోరా 3-0-29-1, నరైన్ 4-0-17-1, కార్తీక్ త్యాగి 4-0-25-2, వరుణ్ 4-0-28-0, గ్రీన్ 1-0-12-1.

కోల్‌కతా: రహానె (రనౌట్) 13, ఫిన్ ఆలెన్ (నాటౌట్) 100, అంగ్రిష్ రఘువంశీ (బి) అక్షర్ 1, గ్రీన్ (నాటౌట్) 33, ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 14.2 ఓవర్లలో 147/2; వికెట్ల పతనం: 1-29, 2-31; బౌలింగ్: స్టార్క్ 3-0-31-0, అక్షర్ 4-0-27-1, ఎన్‌గిడి 2-0-7-0, విప్రజ్ 2-0-34-0, కుల్దీప్ 3-0-41-0, ముకేశ్ 0.2-0-7-0.

# భువనేశ్వర్ కుమార్ అరుదైన రికార్డ్

ఐపీఎల్ అంటేనే రికార్డుల అడ్డా. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్‌లో ఒక మెమరబుల్ మైలురాయిని చేరుకున్నాడు. గురువారం లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ బరిలోకి దిగడమే ఒక రికార్డుగా మారింది. ఐపీఎల్ హిస్టరీలో ఇప్పటివరకు ఏ ఫాస్ట్ బౌలర్ కూడా 200 మ్యాచ్‌లు ఆడలేదు. ఆ ఘనత సాధించిన ఫస్ట్ ఇండియన్ పేసర్‌గా భువనేశ్వర్ నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్ లో 200 పైగా వికెట్లు తీసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ కూడా అతనే కావడం విశేషం. ఈ అరుదైన రికార్డుపై భువనేశ్వర్ కుమార్ స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు. ఏ మైలురాయి అయినా స్పెషలే అని, కానీ 200 మ్యాచ్‌లు ఆడటం అనేది నిజంగా ఒక బిగ్ అచీవ్‌మెంట్ అని ఆనందం వ్యక్తం చేశాడు. అందుకే చాలా గర్వంగా, హ్యాపీగా ఉందని, ముఖ్యంగా గతేడాది కప్పు గెలిచిన జట్టులో ఉంటూ, ఈ సీజన్ లో కూడా అద్భుతంగా రాణిస్తున్న సమయంలో ఈ రికార్డ్ రావడం ఇంకాస్త స్పెషల్ ఫీలింగ్ ఇస్తోందని పేర్కొన్నాడు. తన కెరీర్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వాటన్నిటిలో ఒకదాన్ని ఎంచుకోవడం కష్టమే కానీ, ఇన్నేళ్ల ప్రయాణంలో తన తొలి వికెట్ మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపాడు. అక్కడి నుండే ఈ జర్నీ మొదలైందని భువీ తన మనసులోని మాటను చెప్పాడు. ప్రస్తుత కాలంలో టీ20 ఫార్మాట్ చాలా వేగంగా మారిపోతోంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో బ్యాటర్లు విరుచుకుపడుతున్నారు. దీనిపై భువనేశ్వర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాటర్ల అప్రోచ్ పూర్తిగా మారిపోయిందని, పవర్‌ప్లేలో వాళ్ళు చాలా అగ్రెసివ్‌గా ఆడుతున్నారని విశ్లేషించాడు. ఇలాంటి కండిషన్స్‌లో బౌలర్లు నిరంతరం తమ గేమ్ ను ఇంప్రూవ్ చేసుకోవడం ఒక పెద్ద ఛాలెంజ్ అని, కానీ తాను మాత్రం ఎప్పుడూ తన బేసిక్స్‌ను బలంగా ఉంచుకోవడానికే ట్రై చేస్తానని, అదే తనను ఇన్ని ఏళ్లుగా సక్సెస్ ఫుల్‌గా ముందుకు నడిపిస్తోందని వివరించాడు. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే భువనేశ్వర్ ఈ మ్యాచ్‌లో వికెట్ తీయలేక పోయాడు. నాలుగు ఓవర్లలో 34 పరుగులు ఇచ్చాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ ఇంజూరీ సమస్యలతో సతమతమవుతోంది. జోష్ ఇంగ్లిస్, మొహ్సిన్ ఖాన్, ఆవేష్ ఖాన్ వంటి కీలక ప్లేయర్లు ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అర్షిన్ కులకర్ణి, మయాంక్ యాదవ్, షాబాజ్ అహ్మద్ టీమ్ లోకి వచ్చారు.



భారత క్రికెట్ లో భువనేశ్వర్ కుమార్ ఒక సైలెంట్ వారియర్ లాంటివాడని, ఎన్ని కొత్త టెక్నాలజీలు వచ్చినా, ఎంతమంది కొత్త బౌలర్లు వచ్చినా భువీ తన స్వింగ్ తో బ్యాటర్లను వణికించగలడని విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. 200 మ్యాచ్‌ల ఈ మైలురాయి అతని హార్డ్ వర్క్ కు నిదర్శనమని గుర్తు చేస్తున్నారు.

# చాహల్ వాపింగ్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న సమయంలో పంజాబ్ కింగ్స్ ( వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ఒక నెగటివ్ న్యూస్ తో హెడ్ లైన్స్ లోకి వచ్చాడు. విమాన ప్రయాణంలో చాహల్ వాపింగ్ చేస్తూ కనిపించాడనే వార్త ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. పంజాబ్ టీమ్ సభ్యులు అహ్మదాబాద్ నుండి హైదరాబాద్ వస్తున్న సమయంలో ఈ ఇన్సిడెంట్ జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలు, ఫోటోలు చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. నిజానికి ఈ విషయం బయటకు రావడానికి టీమ్ మేట్ అర్ష్‌దీప్ సింగ్ కారణవ-ంయ్యాడు. అతను షూట్ చేసిన ఒక వ్లాగ్‌లో చాహల్ ఇ-సిగరెట్ వాడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పక్కనే శశాంక్ సింగ్ వంటి ఇతర ప్లేయర్లు కూడా ఉన్నారు. అయితే ఈ వీడియో వైరల్ అవ్వగానే, పంజాబ్ కింగ్స్ యాజమాన్యం లేదా అర్ష్‌దీప్ సింగ్ ఆ వీడియోను ఎడిట్ చేసి, చాహల్ ఉన్న సీన్లను కట్ చేసి మళ్ళీ అప్లోడ్ చేశారని నెటిజన్లు స్క్రీన్ షాట్లతో సహా నిరూపిస్తున్నారు. విమానంలో ఇలాంటి పనులు చేయడం తోటి ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించడమేనని సోషల్ మీడియా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఐపీఎల్ 2026లో వాపింగ్ వివాదం రావడం ఇది రెండోసారి. కొన్ని రోజుల క్రితమే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్, పంజాబ్ కింగ్స్ తో మ్యాచ్ జరుగుతున్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్ లో వాపింగ్ చేస్తూ కెమెరాకు చిక్కాడు. ఆ విషయంలో బీసీసీఐ సీరియస్ అయ్యి, పరాగ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఇప్పుడు చాహల్ కూడా అదే తరహాలో దొరికిపోవడంతో క్రమశిక్షణపై చర్చ మొదలైంది.ఈ వివాదాలపై టీమిండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా స్పందించాడు. ముఖ్యంగా రియాన్ పరాగ్ ఇన్సిడెంట్ ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటివి కెరీర్ కు అస్సలు మంచిది కాదని అన్నాడు. మీ పర్సనల్ లైఫ్ లో ఏం చేసినా ఎవరికీ అభ్యంతరం ఉండదని, కానీ ఒక పబ్లిక్ స్పేస్ లో ఉన్నప్పుడు, ముఖ్యంగా ఒక టీమ్ కు లీడర్ గా, ఎంతో మంది యువతకు ఇన్స్పిరేషన్ గా ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని హితవు పలికాడు. ఇలాంటి చిన్న చిన్న తప్పుల వల్ల మొత్తం ఇమేజ్ డ్యామేజ్ అయ్యే ఛాన్స్ ఉందని అశ్విన్ హెచ్చరించాడు. ప్రస్తుతానికి ఈ వీడియోపై పంజాబ్ కింగ్స్ టీమ్ గానీ, చాహల్ గానీ ఎటువంటి స్టేట్మెంట్ ఇవ్వలేదు. విమానాల్లో స్మోకింగ్ లేదా వాపింగ్ చేయడం చట్టరీత్యా నేరం. మరి దీనిపై విమానయాన సంస్థ లేదా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందో వేచి చూడాలి. ప్లేయర్లు మైదానంలోనే కాకుండా బయట కూడా స్పోర్ట్స్ మన్ స్పిరిట్ తో మెలగాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



# ఓటముల నుంచి లక్నోకు భారీ ఊరట

ఓటముల్లో రికార్డులు నమోదు చేసిన లక్నో సూపర్ జియాంట్స్ అద్భుతం చేసింది. టాప్‌లో ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ ఇచ్చింది. ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన పంత్ సేన మ్యాచ్‌ను సొంతం చేసుకుని వరుస ఓటములకు బ్రేక్ ఇచ్చింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బెంగళూరు తీవ్రంగా శ్రమించినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. 9 పరుగుల తేడాతో లక్నో విజయం సాధించి హ్యాట్రిక్ ఓటముల నుంచి ఊరట పొందింది.పలుమార్లు వర్షం అంతరాయంతో ఆలస్యంగా జరిగిన ఈ మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించగా.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జియాంట్స్ 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ అద్భుతమైన సెంచరీతో అద్భుతం చేయగా.. అర్షిన్ కులకర్ణి 17 పరుగులు నమోదు చేశాడు. వర్షం పడినా.. పిచ్ ఎలా మారినా కూడా మార్ష్ మాత్రం చెలరేగి ఆడాడు. 56 బంతుల్లో 111 పరుగులు చేసి దుమ్మురేపగా.. వాటిలో 9 బౌండరీలు, 9 సిక్సర్లు బాదాడు. నికోలస్ పూరన్ 38, కెప్టెన్ రిషబ్ పంత్ 32 పరుగులతో రాణించి ప్రత్యర్థికి భారీ స్కోర్‌ను లక్ష్యం విధించారు. లక్నో స్కోర్‌ను కట్టడి చేయడంలో బెంగళూరు బౌలర్లు కొంత తడబడ్డారు. జోష్ హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్యా, రసీక్ సలామ్ తలా ఒక్కో వికెట్ తీయగా.. మిగతా బౌలర్లు వికెట్ పడగొట్టడంలో విఫలమయ్యారు.టాపార్డర్ చేతులెత్తేసిన వేళ మిడిలార్డర్ గొప్పగా పోరాడంతో 19 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయిన బెంగళూరు 7 పరుగుల స్వల్ప తేడాతో మ్యాచ్‌ను చేజార్చుకుంది. జాకోబ్ బెతెల్ 4 పరుగులకు ఔటవగా.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ డకౌట్ అవడంతో బెంగళూరు కష్టాల్లో పడింది. ఓపెనర్లు వెనుదిరిగిన వేళ దేవదత్ పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటిదార్ అద్భుతంగా ఆడి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. పడిక్కల్ 34 పరుగులతో రాణించగా.. రజత్ 31 బంతుల్లో 61 స్కోర్ చేసి సత్తా చాటాడు. జితేశ్ శర్మ ఒక్క పరుగు మాత్రమే చేయగా.. టిమ్ డేవిడ్ గొప్పగా పోరాడి 40 పరుగులు తీశాడు. విజయం కోసం కృనాల్ పాండ్యా (28లి), రొమారియో షెఫర్డ్ (23లి) ఆఖరి బంతి వరకు పోరాటం చేశారు. ఒక దశలో గెలిచేస్తారనుకున్న సమయంలో బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు రాలేకపోయాయి. ఫలితంగా బెంగళూరు మ్యాచ్‌ను కోల్పోవాల్సి వచ్చింది. లక్నో బౌలర్లు ప్రారంభంలో అద్భుతంగా బౌలింగ్ చేయగా.. తర్వాత దాన్ని కొనసాగించలేకపోయారు.యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా బంతులు వేసి కీలకమైన మూడు వికెట్లు తీశాడు. షాబాజ్ అహ్మద్ రెండు వికెట్లతో సత్తా చాటగా.. సీనియర్ బౌలర్ షమీ ఒక వికెట్ తీశాడు. వరుస వికెట్లు తీసిన అనంతరం మిగతా వికెట్లు తీయడంలో తడబడడమే కాకుండా స్కోర్‌ను కూడా నియంత్రించలేకపోయారు. ఫలితంగా ఓవర్లన్నీ ముగిసేవరకు మ్యాచ్ ఫలితం దోబుచులాడింది. కానీ ఆఖరి బంతికి ఊరటనిచ్చేలా మ్యాచ్ జరిగింది. డబుల్ హ్యాట్రిక్ ఓటముల తర్వాత లక్నో సూపర్ జియాంట్స్ కీలక మ్యాచ్‌లో విజయం సాధించింది. పది మ్యాచ్‌లు ఆడిన లక్నో మూడు విజయాలు, 7 ఓటములు చవిచూసింది. బెంగళూరుతో మ్యాచ్‌లో గెలిచి రెండు పాయింట్లు ఖాతాలో వేసుకున్నా పాయింట్ల పట్టికలో చివరి స్థానంలోనే లక్నో కొనసాగుతోంది. ఇక బెంగళూరు జట్టు వం-సగా రెండో ఓటమి సాధించగా.. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి ఆరు విజయాలు, నాలుగు ఓడిపోయింది. ఓడిపోయినా కూడా పాయింట్ల పట్టికలో టాప్ 3లోనే బెంగళూరు కొనసాగుతోంది.






## బాలీవుడ్ డెబ్యూ.. సాయి పల్లవి నిజాయితీకి హ్యాట్సాఫ్!

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి రీసెంట్ గా బాలీవుడ్ లో అడుగుపెట్టగా, ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. డెబ్యూ హిందీ మూవీ ఏక్ దిన్ తో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె.. సినిమాలో తాను పోషించిన పాత్రకు సూట్ అవ్వలేదేమోనని అనిపించిందని చెప్పడం చర్చనీయాంశమైంది. కొన్ని రోజుల క్రితం ఆ సినిమా ప్రమోషన్స్ లో చేసిన కామెంట్స్ ఇప్పుడు మళ్లీ ట్రెండ్ అవుతున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ హీరోగా నటించిన ఆ చిత్రాన్ని అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. ప్రేమకథా నేపథ్యంలో రూపొందిన ఆ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలైనా.. ఆశించిన స్థాయిలో ఆడియన్స్ నుంచి రెస్పాన్స్ పొందలేకపోయింది. ముఖ్యంగా సౌత్ ఆడియన్స్ కు ఆ కథ, పాత్రలు అంతగా కనెక్ట్ కాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇక ఆ సినిమాకు ఓకే చెప్పడానికి కారణాల గురించి మాట్లాడిన సాయి పల్లవి.. “ఆ సమయంలో నేను వరుసగా భావోద్వేగాలకు సంబంధించిన సినిమాల్లో నటిస్తున్నా. అందుకే మనసుకు హాయిగా అనిపించే కథ చేయాలని అనిపించింది. ఏక్ దిన్ కథ విన్నప్పుడు నాకు బిఫోర్ సన్ రైజ్ సినిమా గుర్తొచ్చింది. ఆ చిత్రం నాకు చాలా ఇష్టం. అందుకే వెంటనే ఓకే చెప్పా” అని తెలిపారు. కానీ సినిమా ప్రీమియర్ షో చూసిన తర్వాత మాత్రం తనపై తనకు డౌట్ వచ్చిందని ఆమె చెప్పారు. ఆ పాత్రకు తాను కరెక్ట్ గా సూట్ కాలేదేమో అనిపించిందని చెప్పిన సాయి పల్లవి.. తన బదులు ఇంకో కొత్త అమ్మాయి ఉంటే పాత్రకు మరింత ఎనర్జీ వచ్చేదేమోనని అభిప్రాయపడ్డారు. అంతే కాదు.. అప్పుడే ఆ విషయాన్ని అమీర్ ఖాన్ తో కూడా చెప్పానని వెల్లడించారు.

## త్రిష- విజయ్‌ల పెళ్లి అంటూ.. వార్తలు చక్కర్లు



త్రిష కృష్ణన్. ప్రస్తుతం తమిళ్ ఇండస్ట్రీలోనే కాదు తెలుగు ఇండస్ట్రీలో కూడా ఈ పేరు మార్మోగిపోతోంది. ఒకప్పుడు సినిమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న త్రిష.. ఇప్పుడు దళపతి విజయ్ తో ప్రేమాయణం నడిపిస్తోంది అనే వార్తల వలన గుర్తింపు తెచ్చుకొంటోంది. విజయ్ ఎన్నికల్లో గెలవడానికి ప్రధాన కారణం త్రిష అనే చెప్పుకొస్తోన్నారు. త్రిష కోసం విజయ్.. తన భార్య సంగీతకు విడాకులు ఇవ్వనున్నాడు. ఈ విషయాన్ని సంగీతనే అధికారికంగా తెలిపింది. ఎలక్షన్స్ ముందు విజయ్ – త్రిష రిలేషన్ ని తప్పు అన్నవాళ్ళే గెలిచాకా ఈ జంట పెళ్ళి చేసుకోవాలని కోరుకోవడం గమనార్హం. రికార్డ్ విజయాన్ని అందుకున్న విజయ్.. త్వరలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నాడు. ఇక దాని తరువాత త్రిషను ఆయన రెండో పెళ్ళి చేసుకుంటున్నాడని కోలీవుడ్ మీడియాలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా సంగీతతో విడాకులు తీసుకున్నాకా.. విజయ్, త్రిష మెడలో తాళి కట్టనున్నాడట. 999 లో విజయ్, సంగీతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. ఇక త్రిష, విజయ్ జీవితంలోకి వచ్చాకా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చాలాకాలంగా సంగీత, విజయ్ కి దూరంగా పిల్లలతో కలిసి ఉంటుంది. ఇక ఎన్నికల ముందు సంగీత.. తన భర్త నుంచి విడాకులు కావాలని కేసు వేయడం సంచలనంగా మారింది. తన భర్తకు వేరే నటితో ఎఫైర్ ఉందని, అందుకే అతని నుంచి విడాకులు కోరుకుంటున్నట్లు ఆమె తెలిపింది. ప్రస్తుతం విజయ్ – సంగీత విడాకుల కేసు ఫ్యామిలీ కోర్టులో ఉంది. అతి త్వరలోనే వీరి విడాకులు మంజూరు కానున్నాయని, ఆ తరువాత విజయ్– త్రిష పెళ్ళి చేసుకోబోతున్నారని అంటున్నారు.

## ఓటిటిలోకి వచ్చేస్తోన్న దురంధర్-2




బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ 2

ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ సినిమా డిజిటల్ విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, తాజాగా ఓటీటీ విడుదల తేదీపై స్పష్టత వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా అద్భుత వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఇప్పుడు మే 15 నుంచి ఈ సినిమా ఓటీటీలో ప్రసారం కానుందని సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. 'ధురంధర్ 2' ఒకేసారి రెండు ప్రముఖ ఓటీటీ వేదికల్లో విడుదల కానుంది. భారతదేశంలో ఈ చిత్రం జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుండగా, విదేశీ ప్రేక్షకుల కోసం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. అంతేకాకుండా ఈ సినిమాను కేవలం హిందీలోనే కాకుండా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా విడుదల చేయనున్నారు. దీంతో దక్షిణాది ప్రేక్షకులు కూడా తమ భాషలో ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు. మరో ప్రత్యేకత ఏమిటంటే.. థియేటర్లలో ప్రదర్శించిన సాధారణ వెర్షన్‌కు భిన్నంగా, ఓటీటీలో 'రా అండ్ అన్‌కట్' వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. అంటే థియేటర్లలో చూపించని కొన్ని ప్రత్యేక సన్నివేశాలు కూడా ఓటీటీ వెర్షన్‌లో ఉండనున్నాయి. దీంతో అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. 2025 చివర్లో విడుదలైన 'ధురంధర్' చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ఈ సీక్వెల్ మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన మొదటి రోజు నుంచే అద్భుత స్పందన అందుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లు సాధించి భారతీయ సినీ చరిత్రలో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో రెండో స్థానానికి చేరుకుంది. ఈ జాబితాలో మొదటి స్థానంలో 'దంగల్' కొనసాగుతుండగా, 'బాహుబలి 2'ను వెనక్కి నెట్టి 'ధురంధర్ 2' రెండో స్థానాన్ని దక్కించుకోవడం విశేషంగా మారింది. ఈ చిత్రాన్ని దర్శకుడు ఆదిత్య ధర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. సినిమాలో సారా అర్జున్, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, మాధవన్ కీలక పాత్రల్లో నటించారు. భారీ యాక్షన్ సన్నివేశాలు, స్పై నేపథ్యం, ఉత్కంఠభరిత కథనం, అద్భుత విజువల్స్‌తో తెరకెక్కిన 'ధురంధర్ 2' ఓటీటీలో కూడా అదే స్థాయి స్పందన అందుకుంటుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎవరినీ బాధపెట్టాలను కోలేదు..

వివాదాస్పద సాంగ్‌పై నోరా ఎమోషనల్ కామెంట్స్

కన్నడ పాన్ ఇండియా సినిమా ఖణ: ది డెవిల్ లోని సర్కే చునార్ తేరి సర్కే సాంగ్ చుట్టూ నెలకొన్న వివాదం దేశవ్యాప్తంగా మరోసారి సినీ పరిశ్రమలో కంటెంట్ బాధ్యతపై చర్చకు దారితీసింది. ఈ వివాదానికి సంబంధించి బాలీవుడ్ నటి నోరా ఫతేహి గురువారం జాతీయ మహిళా కమిషన్ ఎదుట హాజరై తన వివరణ ఇచ్చారు. వివాదాస్పద పాట కారణంగా ఎవరైనా మనోభావాలు దెబ్బతిన్నట్లయితే క్షమాపణలు చెబుతున్నానని, ఒక ఆర్టిస్ట్‌గా తనకు ఉన్న బాధ్యతను పూర్తిగా అర్థం చేసుకున్నానని ఆమె తెలిపారు. ఎవరినీ బాధపెట్టాలనే ఉద్దేశం తనకు లేదని, కానీ కళాకారిణిగా సమాజంపై ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మీడియాతో మాట్లాడుతూ నోరా పేర్కొన్నారు. ఈ సాంగ్ హిందీ వెర్షన్ రిలీజైన వెంటనే సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా సాంగ్ లోని సాహిత్యం, చిత్రీకరణ తీరు అసభ్యకరంగా ఉందని పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. యూట్యూబ్‌లో విడుదలైన కొద్ది రోజులకే ఈ వీడియోపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో నిర్మాతలు హిందీ వెర్షన్‌ను యూట్యూబ్ నుంచి తొలగించారు. అయినప్పటికీ ఆ సాంగ్ క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ కమిషన్ ఆఫ్ ఉమెన్ స్వయంగా కేసును పరిశీలించి నోరా ఫతేహీతో పాటు సంజయ్ దత్, లిరిసిస్ట్ రఖీబ్ ఆలం, నిర్మాత వెంకట్ కె నారాయణ, డైరెక్టర్ కిరణ్ కుమార్‌లకు నోటీసులు జారీ చేసింది.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA